నేడు TELUGU DAILY
విలేకరులు కావలెను
అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.
9346984911
9133445456

సంచలన వార్తలకు
# నేడు
TELUGU DAILY

శుక్రవారం | 05.06.2026 | సంపుటి : 4 | సంచిక : 39 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com



టీ20 కెప్టెన్సీ రేసులో శ్రేయస్ 08

## పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు
# యుద్ధప్రాతిపాదికన పూర్తి


02

**పాలమూరు ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**

**పలు ప్రాజెక్టులను ఏరియల్ సర్వే చేసిన సీఎం**

**ప్రాజెక్టుల స్థితిగుతలపై అధికారులతో ఆరా**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమశిలలో ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా ఏరియల్ సర్వే నిర్వహించారు.

## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా
# లక్ష ఎకరాలకు సాగునీరు

**ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన**

**త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు.


02



## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

**మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు**

**సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు**

**న్యూఢిల్లీ, జూన్ 4 :** పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీం కోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్‌టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు

-మిగతా 2 లో..



## తెలంగాణ ఉద్యమకారులకు
# న్యాయం చేస్తాం

**ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం**

**అఖిలపక్ష భేటీలో కమిటీ చైర్మన్ కేశవరావు**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది.

హైదరాబాద్, జూన్ 4 : ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తా మని అన్నారు. అందుకోసం ఉద్యమకారుల ందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నా రు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్న దే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరిం చారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులం దరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలం గాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమ కారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు

-మిగతా 2 లో..

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం
# భూముల ధరలు

**నేటి నుంచే అమల్లోకి పెంచిన రేట్లు**

**రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం**

**సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర**

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్, జూన్ 4 : మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని

-మిగతా 2 లో..



## కార్మికులకు అండగా
# నిలిచేది బీఆర్ఎస్

**కార్మికుల సమస్యలపై సిఎంకు పట్టింపు లేదు**

**జలమండలి గేట్ మీటింగ్‌లో తలసాని శ్రీనివాసయాదవ్**

ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాడేది గులాబీ జెండా మాత్రమేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై ప్రసంగించారు.

**హైదరాబాద్, జూన్ 4 :** వాటర్ బోర్డులో 50 సంవత్సరాల లో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం 650 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వాటర్ వర్క్స్ బోర్డు లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్న రాంబాబు యాదవ్‌ను 6 వ తేదీన జరిగే గుర్తింపు ఎన్నికలలో గెలిపించుకోవాలని తలసాని పిలుపునిచ్చారు. మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకున్నముఖ్యమంత్రి రెండున్నర సంవత్సరాలలో ఒక్కసారైనా సమీక్ష చేశారా? అని

- మిగతా 2 లో..

## ఎల్‌నినో ప్రభావంపై
# రైతులకు అవగాహన

**వర్షాభావంపై సన్నద్ధం చేయండి**

**వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల సూచన**

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేశారు.



హైదరాబాద్, జూన్ 4 : పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్

-మిగతా 2 లో..



**నేటి చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 128 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 155 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 240 (కిలో) |
| స్కిన్ లెస్ | 271 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹80

## రాష్ట్రంలో తగ్గని
# ఎండల తీవ్రత

**అంగన్‌వాడీ కేంద్రాలకు 14 వరకు సెలవులు**

**15న తిరిగి ప్రారంభించాలని ఆదేశాలు**

హైదరాబాద్, జూన్ 4 : రాష్ట్రంలో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మే నెల ముగిసినా ఎండల తీవ్రత, వడగాల్పుల ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న పిల్లలు, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు

-మిగతా 2 లో..





## ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో
# అరుదైన దృశ్యం

**ప్రమాదం నుంచి బయటపడేందుకు కిందకు దూకిన బాధితులు**

**కింద పరుపులు పరచి కాపాడిన తండ్రీ కొడుకులు**


**సోషల్ మీడియాలో వారిపై సరవ్తరా ప్రశంసలు**

02

## సూడాన్ ప్రయాణికుడికి
# ఎబోలా లక్షణాలు

**గాంధీ ఆస్పత్రికి తరలింపు**

**హైదరాబాద్, జూన్ 4 :** శంషాబాద్ ఎయిర్–పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించారు. గురువారం సూడాన్ నుంచి నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న మహ్మద్ అనే ప్రయాణికుడికి.. ఎయిర్‌పోర్టులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్క్రీనింగ్ కేంద్రంలో పరీక్షలు నిర్వహిం చారు. ఎబోలో వైరస్ హిస్టరీ ఉన్నట్టు గుర్తించిన వైద్య సిబ్బంది వెంటనే అప్రమత్తయ్యారు. వెంటనే అతన్ని గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ సెంటర్‌కు తరలించారు. శాంపిల్స్ సేకరించి సీసీఎంబీకి పంపించినట్టు గాంధీ ఆసుపత్రి వైద్యులు తెలిపారు.





## ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో
# అరుదైన దృశ్యం

- ప్రమాదం నుంచి బయటపడేందుకు కిందకు దూకిన బాధితులు
- కింద పరుపులు పరచి కాపాడిన తండ్రీ కొడుకులు
- సోషల్ మీడియాలో వారిపై సరవ్తరా ప్రశంసలు

**న్యూఢిల్లీ, జూన్ 4 :** దేశరాజధాని ఢిల్లీలోని ఒక లాడ్జ్‌లో బుధవారం జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఘటనలో 21 మంది మృత్యువాతపడ్డారు. అయితే, స్థానికంగా షాపు నిర్వహిస్తున్న తండ్రీకొడుకులు భవనంలో చిక్కుకున్న అనేక మంది ప్రాణాలను కాపాడారు. ప్రస్తుతం వారిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. బుధవారం ఉదయం భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అనేక మంది చిక్కుకుపోయారు. వారు కిందకు వచ్చేందుకు ఏ అవకాశమూ లేకపోయింది. దీంతో కొందరు భవనం నుంచి కిందకు దూకేందుకు సిద్ధమయ్యారు. కిందకు దూకితే ఏం కాదుగా అంటూ అక్కడున్న వారిని ఆందోళనతో ప్రశ్నించారు. ఈ క్రమంలో రియాజుద్దీన్, ఆయన కుమారుడు అర్మాన్ రంగంలోకి దిగారు. క్షణకాలం కూడా ఆలస్యం చేయకుండా భవనానికి సమీపంలో నేలపై కొత్త పరుపులను పరిచారు. దీంతో, బాధితులు వాటిపైకి సురక్షితంగా దూకి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. 'ఉదయం నేను షాపు వద్దకు వచ్చేసరికే అక్కడ పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో కూడా మంటలు వ్యాపించాయి. లోపలికి వేళ్లేందుకు, బయటకు వచ్చేందుకు అసలు ఏ దారీ లేకుండా పోయింది. మమ్మల్ని కిందకు దూకేయమంటారా అంటూ పై అంతస్తుల్లోని వారు భయంతో ప్రశ్నించారు. దీంతో, వెంటనే నేను మా షాపులోంచి 20 నుంచి 25 వరకూ పరుపులు, క్విల్ట్స్‌ను తీసుకొచ్చి భవనం బయట పరిచాను' అని అర్మాన్ అన్నారు. 'ఈ క్రమంలో మాకు రూ.2 లక్షల వరకూ నష్టం వచ్చింది. బాధితులకు దుప్పట్లు కూడా ఇచ్చాము. మృతులను బయటకు తెచ్చేందుకు కూడా దుప్పట్లను ఇచ్చాము. మా వద్ద ఉన్నవన్నీ ఇచ్చేశాము. మానవత్వపు కోణంలో చూస్తే ఎవరైనా ఒకటే. హిందువైనా, ముస్లింలైనా మనందరం భారతీయులమే. కాబట్టి, కష్టాల్లో ఉన్న సోదరులకు స్నేహం చేయడం మా బాధ్యత' అని అర్మాన్ తండ్రి రియాజుద్దీన్ అన్నారు. దీంతో, ఈ తండ్రీకొడుకులపై ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది.

## తెలంగాణ ఉద్యమకారులకు
# న్యాయం చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ పక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.



## నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు

### ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం: తలసాని

**హైదరాబాద్, జూన్ 4 :** అగ్నిప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమీర్ పేటలోని మైత్రివనం వద్ద అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదం వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు అందుబాటులోకి తేవాలని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అధికారులను ఆయన అభినందించారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్, ప్రవీణ్ రెడ్డి, సుమిత్ సింగ్, కట్టా బలరాం, సాయి, ప్రదీప్ గౌడ్ ఉన్నారు.

## పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు
# యుద్ధప్రతిపాదికన పూర్తి

**మహబూబ్‌నగర్, జూన్ 4 :** ముఖ్యమంత్రి , మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని పలు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలు, , జూరాల ప్రాజెక్టు డ్యామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ పరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పథకంలో అత్యంత కీలకమైన కాట్రేవుపల్లి పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పనుల నిర్మాణ శైలిని, పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వీక్షించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుండటంతో దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఏరియల్ సర్వే అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులన్నింటినీ వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న అడ్డంకులను తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది.



## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

**నారాయణపేట, జూన్4 :** మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. ÷ూష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రార్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగింద న్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసి అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విష యంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుం టున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామా ల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించా రు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయిం చినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు. రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెలించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

## రాష్ట్రంలో తగ్గని ఎండల తీవ్రత

(మొదటిపేజీ తరువాయి)



వేసవి సెలవులను పొడిగించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝ వేసవి సెలవులను జూన్ 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14వ తేదీన ఆదివారం కావునా.. జూన్ 15 నుండి ఈ కేంద్రాలు యథావిధిగా తిరిగి పనిచేయడం ప్రారంభిస్తాయి. నిజానికి ముందస్తు ప్రణాళిక ప్రకారం జూన్ 2వ తేదీ నుంచే అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. అయితే, జూన్ మొదటి వారంలో కూడా ఉష్ణోగ్రతలు 40 నుండి 45 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటం, మధ్యాహ్నం వేళల్లో తీవ్రమైన ఉష్ణగాలులు వీస్తుండటంతో తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. చిన్న పిల్లలు ఎండ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సైతం ఎండల తీవ్రత కారణంగా వేసవి సెలవులను పొడిగించిన సంగతి తెలిసిందే. పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా జూన్ 14 వరకు మూసి ఉంచాలని, విద్యాసంస్థలతో పాటే జూన్ 15న ఒకేసారి తెరవాలని ప్రభుత్వం భావిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారు 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు కావడంతో వారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో వారు బయటకు వస్తే వడదెబ్బ తగిలి డీహైడ్రేషన్, జ్వరం బారిన పడే అవకాశం ఉంది. అందుకే వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకుంది. సెలవుల పొడిగింపు కేవలం చిన్న పిల్లల రాకకు మాత్రమే వర్తిస్తుంది. అయితే అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందే పౌష్టికాహారం పంపిణీకి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అంగన్‌వాడీ సిబ్బందితో పాటు, చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన అధికారిక మార్గదర్శకాలు, జీవో త్వరలోనే విడుదల కానున్నాయి.

## వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు

### ప్రజలకు అదనపు కలెక్టర్ సూచన

**జగిత్యాల,జూన్4 :** వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్, బట్టపల్లి, పోతారం, నాయకపు గూడెం, బీర్పూర్ మండలంలోని బీర్పూర్, నర్సింహులపల్లి, తుంగూర్, కందేనకుంట గ్రామాల్లో అధికారులు ప్రత్యేక గ్రామసభలు గురువారం నిర్వహించారు. బీర్పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గ్రామాల్లో వర్షాకాలంలో పారిశుద్య నిర్వహణపై ఆ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు, పారిశుద్య నిర్వహణ, ఎలినినో ప్రభావ పరిస్థితుల్లో రైతులు పంటల మార్పిడీ చేసుకోవడం, మ చర్యలు, గ్రామాల్లో ఇంకుడు గంతల నిర్మాణాల ఏర్పాటు, నీటిని పొదుపుగా వాడుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశాల్లో బీర్పూర్ మండల ప్రత్యేక అధికారి ప్రకాష్, తహసీల్దార్లు వహిదొద్దిన్, సుజాత, ఎంపీడీఓలు ఎండి సలీం, భీమేష్ ప్రజాప్రతినిధులు చేకూట ఆరుణ శేఖర్, మర్రిపెల్లి అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

## కార్మికులకు అండగా నిలిచేది బీఆర్ఎస్

(మొదటిపేజీ తరువాయి)

తలసాని ప్రశ్నించారు. మీ సమస్యలపై ముఖ్యమంత్రికే పట్టింపు లేనప్పుడు ఆ పార్టీకి సంబంధించిన వ్యక్తిని గెలిపిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన చేతకాక ప్రశ్నించే వారిపై ఎదురుదాడి చేస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం అవగాహన, ప్రణాళిక లేకుండా మూడు కార్పొరేషన్లుగా విభజించి ఉద్యోగులు, ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని తలసాని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ రోజు కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా త్రాగునీటిని సరఫరా చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం త్రాగునీటిని కూడా సక్రమంగా ఇవ్వలేకపోతుందని మండిపడ్డారు. మీకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీ అని, మీ హక్కుల కోసం అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రకటించారు. మీ కోసం గొంతుక వినిపించే గులాబీ జెండాకు మద్దతు తెలపాలని తలసాని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బోర్డులోని అనేక సమస్యలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అటు సూర్యుడు ఇటు పొడిచినా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తలసాని హామీ ఇచ్చారు.



## ఎల్‌నినో ప్రభావంపై
# రైతులకు అవగాహన

(మొదటిపేజీ తరువాయి)

శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ఎ÷-లాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

# 2027 నాటికి 1,000 ఉద్యోగాల కల్పన

## అమెరికా టెలికాం దిగ్గజం గ్లోబల్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్:** అమెరికాలోని ప్రముఖ టెలికాం సంస్థ 'టీఎంయూఎస్ గ్లోబల్ సొల్యూషన్స్ (టి-మొబైల్ యూఎస్ఏ)' భారత మార్కెట్లోకి అధికారికంగా ప్రవేశిస్తూ.. హైదరాబాద్‌లో తన కొత్త 'గ్లోబల్ టెక్నాలజీ సెంటర్'ను నెలకొల్పింది. టి-మొబైల్ జీటీసీ రాకతో.. దేశంలోనే అత్యంత ప్రాధాన్యం కలిగిన జీసీసీ కేంద్రంగా తెలంగాణ మరోసారి గుర్తింపు పొందింది. హైటెక్ సిటీలో 2.5 లక్షల చ.అ. విస్తీర్ణంతో ఏర్పాటుచేసిన ఈ సాంకేతిక కేంద్రాన్ని గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణతో కలిసి కేంద్రాన్ని సందర్శించిన మంత్రి.. టీఎంయూఎస్ గ్లోబల్ సొల్యూషన్స్ ఇండియా నాయకత్వ బృందంతో సమావేశమై సంస్థ భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. హైదరాబాద్‌లోని ఈ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్.. టి-మొబైల్ సంస్థకు కీలక ఆవిష్కరణ కేంద్రంగా పనిచేయనుంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, డెవ్‌ఓప్స్, ఉత్పత్తుల అభివృద్ధి, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ టెక్నాలజీలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), ఆటోమేషన్ వంటి అత్యాధునిక రంగాల్లో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది. ప్రస్తుతం కార్యకలాపాలు ప్రారంభించిన ఈ కేంద్రంలో.. 2027 నాటికి దాదాపు 1,000 మంది ఉద్యోగులను నియమించాలనే లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకుంది. అమెరికాలో 140 మిలియన్లకు పైగా వినియోగదారులకు సేవలు అందిస్తున్న టి-మొబైల్.. భవిష్యత్తు తరం కనెక్టివిటీ పరిష్కారాలను అందించే అతిపెద్ద వైర్‌లెస్ నెట్‌వర్క్ ఆపరేటర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. తెలంగాణపై విశ్వాసం ఉంచి హైదరాబాద్‌ను తమ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్ కోసం ఎంపిక చేసిన టి-మొబైల్ నాయకత్వానికి మంత్రి శ్రీధర్‌బాబు ధన్యవాదాలు తెలిపారు. "వారు హైదరాబాద్‌లో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినప్పుడు.. దేశంలోనే అత్యుత్తమ సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందిస్తామని హామీ ఇచ్చాం. నేడు తక్కువ సమయంలోనే వందల మంది నిపుణులను నియమించుకుని వేగంగా అభివృద్ధి చెందుతున్న కేంద్రంగా నిలవడం హైదరాబాద్ ప్రతిభకు నిదర్శనం" అని తెలిపారు. టి-మొబైల్ గ్లోబల్ సొల్యూషన్స్ ఐటీ విభాగం వైస్ ప్రెసిడెంట్ చంద్ర గుప్తా మాట్లాడుతూ.. "సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ఆవిష్కరణలకు అనుకూల వాతావరణం, పరిశ్రమలకు అనుకూలమైన ఎకోసిస్టమ్ అందుబాటులో ఉండడం హైదరాబాద్ ప్రత్యేకత. ఇవన్నీ మా దీర్ఘకాలిక వ్యూహాలకు అనుగుణంగా ఉన్నాయి. హైదరాబాద్ కేంద్రం ద్వారా మా ఇంజినీరింగ్, డిజిటల్ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తాం. తెలంగాణ ప్రతిభతో కలిసి పనిచేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించే సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేస్తాం" అని తెలిపారు.

# తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దు

## ఆంధ్రా నాయకులకు గుత్తా కౌంటర్



**హైదరాబాద్, జూన్ 4 :** తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దని తెలంగాణ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ నాయకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతుంటే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభను నిర్వహిస్తామనడం సరైనది కాదని మీడియా చిట్‌చాట్‌లో పేర్కొన్నారు. మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ వాడిన భాష తీరు సరిగా లేదని వెల్లడించారు. అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అంటున్న సీఎం ,డిప్యూటీ సీఎం , మంత్రులు అమరావతిలోనే నివాసం ఉండాలని సూచించారు. తెలంగాణ కన్నా ఏపీలో ఎక్కువ సోర్స్ ఉన్నాయి. సముద్ర తీరం ఉంది. రకరకాల పోర్టులు ఉన్నాయి. ఆ నాయకులంతా ఏపీ అభివృద్ధి చూసుకోవాలి తప్ప తెలంగాణా వైపు చూడొద్దని హితవు పలికారు. తెలంగాణలో విద్వేషాలకు ప్రయత్నించవద్దని తెలిపారు. తెలంగాణ లో 75 శాతం ధాన్యం సేకరణ పూర్తి అయిందని, ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు. రైతులు వరి , పత్తి తప్ప ఏ పంటలు పండించడం లేదని వివరించారు.

# 5, 6, 7 తేదీల్లో హైటెక్స్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన

**హైదరాబాద్, జూన్ 4 :** అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన పోచంపల్లి 'ఇక్కత్' వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఈనెల 5,6,7 తేదీల్లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. పోచంపల్లి చేనేత కళాకారుల జీవన ప్రమాణాల మెరుగుపరిచే లక్ష్యంతో జూన్ 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్ హైటెక్స్ లో 'త్రెడ్ పోచంపల్లి' పేరిట వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచేందుకు ఏర్పాటు చేసే ఈ ఎగ్జిబిషన్ లో దాదాపు 100 పైగా స్టాల్స్, మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.



# ఢిల్లీ అగ్నిప్రమాద ఘటన

## హోటల్ యజమాని అరెస్ట్

**న్యూఢిల్లీ, జూన్ 4 :** ఢిల్లీలోని మాల్వీయ నగర్‌లోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో 21 మంది మృతిచెందిన ఘటనలో ఆ హోటల్ ఓనర్ లవ్‌కేశ్ బజాజ్‌ను నాలుగు రోజుల పోలీసు కస్టడీకి పంపిస్తూ ఢిల్లీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జుడిషయల్ మెజిస్ట్రేట్ భాను ప్రతాప్ సింగ్ ఈ ఆదేశాలు ఇచ్చారు. దర్యాప్తు కోసం కస్టడీలోకి తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు అభ్యర్థించారు. అగ్నిప్రమాదం వేళ నిర్లక్ష్యం కింద కేసు బుక్ చేశారు. ఫ్లోరిష్ స్టే బీ అండ్ బీలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిలో ఎక్కువ శాతం మంది విదేశీయులు ఉన్నారు. సమీప ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి బంధువులే ఆ మృతుల్లో ఉన్నారు. అయితే ఏ కారణం చేత మంటలు వ్యాపించాయో ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఎలోరిష్ స్టే హోటల్ కోసం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద హోటల్ ఓనర్ బజాజ్ లైసెన్సు తీసుకున్నారు. కానీ ఆ లైసెన్సు ప్రకారం అతిథులకు కేవలం ఆరు రూమ్‌లు మాత్రమే ఉంటాయి. కానీ ప్రాథమిక విచారణ ప్రకారం.. స్టేలో 25 రూమ్‌లు ఆపరేటింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. బేస్మెంట్‌లో ఉన్న అకామిడేషన్‌ను కూడా వాడుతున్నారు. ఆ ప్రాపర్టీకి మొత్తం ఓనర్ బజాజ్ ఒక్కడే. జై మిశ్రా అనే వ్యక్తికి మేనేజ్మెంట్ అప్పగించినట్లు ఆయన చెప్పారు. అయితే మిశ్రా కోసం ప్రస్తుతం పోలీసులు గాలిస్తున్నారు. అతను పరారీలో ఉన్నాడు. బీ అండ్ బీ స్కీమ్‌ను 2007లో ప్రవేశపెట్టారు. ఆ స్కీమ్‌లో సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన వసతిని ఇవ్వనున్నారు. బుధవారం జరిగిన ప్రమాదంలో 21 మంది మృతిచెందగా, దాంట్లో 12 మంది విదేశీయులు ఉన్నారు.

# ఇండియా కూటమికి బీటలు

- 8వతేదీ ఇండీ కూటమిని బహిష్కరించిన డీఎంకే
- హాజరు కాబోవడం లేదని ప్రకటన విడుదల

**న్యూఢిల్లీ, జూన్ 4 :** అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇందులో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై డీఎంకే శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వచ్చింది. తమ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని క్షమించేది లేదంటూ డీఎంకే ఒక ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుంచి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డీఎంకే గుర్తు చేసింది. నీట్, ఒకే దేశం-ఒకే సారి ఎన్నికలు, వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని డీఎంకే వెల్లడించింది. కూటమితో భేటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర పార్టీల పోరాటాలకు మద్దతు ఇస్తామని డీఎంకే ప్రకటించింది. దీంతో డీఎంకే - కాంగ్రెస్ బంధంలో వివాదం ముదిరినట్లు అయింది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమికి డీఎంకే భారీ షాక్ ఇచ్చినట్లు అయింది.

# ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో మరో విషాదం

## ఒకే కుటుంబానికి చెందిన 8మంది దుర్మరణం

**న్యూఢిల్లీ, జూన్ 4 :** దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో గల ఫ్లోరిష్ స్టే రెస్టారెంట్‌లో బుధవారం ఉదయం జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. గురుగ్రామ్‌లోని సెక్టార్ 46కు చెందిన వివేక్ అగర్వాల్ అనే చార్టర్డ్ అకౌంటెంట్.. మ్యాక్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తండ్రిని పరామర్శించేందుకు ఢిల్లీ వెళ్లారు. ఆయనతో పాటు తల్లి ప్రేమ్ లత, భార్య తర్జనీ అగర్వాల్, ఇద్దరు కుమార్తెలు జివిషా, వారియా, మరో ముగ్గురు బంధువులూ ఉన్నారు. వీరంతా బస చేసేందుకు.. ప్రమాదానికి గురైన ఫ్లోరిష్ స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్‌లో 2 గదులను బుక్ చేసుకున్నారు. వీరు అల్పాహారం తీసుకుంటుండగా ఒక్కసారిగా ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మొత్తం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ కుటుంబంలో ప్రాణాలతో మిగిలిన ఏకైక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివేక్ అగర్వాల్ తండ్రి రాధేశ్యామ్ అగర్వాల్(80) మాత్రమే. ఒకే కుటుంబంలోని 8 మంది మరణించడంతో గురుగ్రామ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా.. డీఎన్ఏ టెస్టుల అనంతరం బంధువులకు మృతదేహాలను అప్పగిస్తామని అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8:30 గంటలకు ఆ రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇరుకైన భవనం కావడంతో వేగంగా మంటలు వ్యాపించాయి. ఎంట్రీ, ఎగ్జిట్ ఒకేచోట ఉండటంతో అందులో ఉన్నవారు తప్పించుకునేందుకు వీలులేకుండా పోయింది. ప్రమాద సమయంలో అందులో సుమారు 40 మంది ఉన్నట్టు సమాచారం. వారిలో 21 మంది చనిపోగా.. కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు కిటికీలు, భవనం పైనుంచి దూకి తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో విదేశీయులే ఎక్కువ మంది ఉన్నట్టు తెలుస్తోంది. వీరంతా సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుంచి చికిత్స కోసం అక్కడికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా.. ఢిల్లీ ప్రభుత్వం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద ఆ హోటల్‌కు లైసెన్స్ మంజూరు చేసింది. దీని ప్రకారం.. ఆ ప్రాపర్టీలో 6 గదులకే అనుమతి ఉండగా.. బేస్‌మెంట్‌లోని కొన్ని గదులతోపాటు మొత్తం 25 గదులతో ఆ రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.

# తృణమూల్‌కు వరుస ఎదురుదెబ్బలు

- అసెంబ్లీ తరహాలో పార్లమెంటులోనూ తిరుగబాటు
- తాజా రాజకీయాలపై జాతీయ మీడియాలో కథనాలు

**కోల్‌కతా, జూన్ 4 :** పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అసెంబ్లీ తరలహాలోనే టీఎంసీ ఎంపీలు కూడా తిరుగుబాటు బావుటా ఎగరవేయనున్నారనే వార్తలు ప్రచారం అవుతున్నాయి. టీఎంసీకి చెందిన సుమారు 20 మంది ఎంపీలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇప్పటికే ఈ ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఉన్నతస్థాయిలో చర్చలు కూడా జరుగుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తృణమూల్‌కు లోక్‌సభలో 28 మంది ఎంపీలు, రాజ్యసభలో 13 మంది ఎంపీలు ఉన్నారు. పార్లమెంటులో ఎంపీల సంఖ్యాపరంగా టీఎంసీ రెండో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు వేదికగా టీఎంసీ చీలిపోతే పార్లమెంటులో ప్రతిపక్షం ప్రభావం గణీయంగా తగ్గుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇటీవల పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో కనిపించిన సీన్ రాబోయే కొన్ని రోజుల్లో పార్లమెంటులో కూడా కనిపిస్తుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. టీఎంసీ రెబల్ వర్గం బలం మరింత పెరుగుతుందని అంటున్నారు. ప్రస్తుతం తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ తమ పార్టీ ఎన్నికల గుర్తు, పార్టీ పేరును కాపాడుకునే పనిలో నిమగ్నమైనట్టు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. టీఎంసీకి రాష్ట్రంలో 80 ఎమ్మెల్యేలు ఉండగా రుతుబ్రత బెనర్జీ నేతృత్వంలో 58 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు బావుటా ఎగరేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీలో తామే అసలైన టీఎంసీ అని రుతుబ్రత స్పష్టం చేయడంతో ఆయనకు ప్రతిపక్ష నేత హోదా దక్కింది. పశ్చిమబెంగాల్‌లో ఓటమి తరువాత టీఎంసీలో విభేదాలు పెరిగాయి. రాష్ట్రంలో అవినీతి, ఆర్‌జీ కార్ ఆసుపత్రి హత్యాచారం కేసులో ప్రభుత్వ తీరును సొంత పార్టీ నేతలే విమర్శించారని సమాచారం.



# పవన్ కళ్యాణ్‌పై మరోమారు ప్రకాశ్ రాజ్ సెటైర్లు

## ఘాటుగా తిప్పికొట్టిన నిర్మాత బండ్ల గణేశ్

**హైదరాబాద్, జూన్ 4 :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అంశంలో నటుడు ప్రకాశ్ రాజ్, నిర్మాత బండ్ల గణేశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్‌లో వార్ నడుస్తోంది. తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై ప్రకాశ్ రాజ్ సెటైర్ వేస్తే.. ప్రకాశ్ రాజ్‌కు బండ్ల గణెళశ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో జనసేన పోటీపై ఎక్స్‌లో పోస్ట్ చేసిన ప్రకాశ్ రాజ్.. పవన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మీరొస్తామంటే మేమొద్దంటామా.. రండి దొర. సింగిల్‌గా వస్తున్నారా.. పొత్తుతో వస్తున్నారా చెప్పి రండి' అని ప్రకాశ్ రాజ్ పోస్ట్ చేశారు. ప్రకాశ్‌రాజ్ పోస్ట్‌కు బండ్ల గణెళశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రతి దాంట్లో ఎందుకు వేలు పెడతావంటూ ప్రశ్నించారు. 'అసలు నువ్వెవరు.. తమిళోడివా? తెలుగోడివా? కన్నడిగుడివా? ప్రతి విషయంలో జడ్జిమెంట్ ఇవ్వడానికి నువ్వేమైనా ప్రధానివా. అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వకు. ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకో. తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయ్' అంటూ ప్రకాశ్ రాజ్‌ను ఉద్దేశించి బండ్ల గణెళశ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రకాశ్ రాజ్, బండ్ల గణేశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్ వేదికగా జరుగుతున్న వార్.. చర్చనీయాంశంగా మారింది.

# తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం

## కరీంనగర్, జనగామ, ములుగు జిల్లాలో మోస్తరు వానలు

**హైదరాబాద్, జూన్ 4 :** తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పుర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు హుజూరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో గాలి దుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ములుగు జిల్లా మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. కాలనీలకు కాలనీలు నీట మునిగిన పరిస్థితి ఉంది. సుభాష్ నగర్, ఆదర్శనగర్ కాలనీలు జలమయం కావడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది. స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ సహాయక చర్యలు చేపట్టారు. ప్రొ÷-లకెయినర్ల సహాయంతో డ్రైనేజీలు క్లీన్ చేయించి వరద నీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. కరీంనగర్ నగరంలో కురిసిన భారీ వర్షానికి కట్టరాంపూర్ నాగన్న చౌరస్తా దగ్గర ఓ ఇంటి ప్రహరీ కూలింది. గోడతో పాటు పక్కనే ఉన్న భారీ వృక్షం కూడా నేలకొరిగింది. అటుగా నిలిపి ఉన్న కారుపై శిథిలాలు పడటంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. భారీ ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో.. పాత గోడలు, భారీ వృక్షాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షానికి పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగి కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంగణం అంతా జలమయమైంది. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్?లో పిడుగు పడింది. మొబైల్?తో వర్షాన్ని రికార్డ్ చేస్తుండగా స్థానికుడు పిడుగుపాటుతో ఉలిక్కిపడ్డాడు.


# పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం

## విజయవాడ రహదారిపై ట్రాఫిక్ చిక్కులు

**హైదరాబాద్, జూన్ 4 :** హయత్‌నగర్‌లో పెట్రోల్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్ పేట్ లక్ష్మారెడ్డి పాలెం దగ్గర కారును ఢీకొట్టి పెట్రో ల్ ట్యాంకర్ పల్టీ కొట్టింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చే రూట్‌లో ప్రమాదం జరగడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సర్వీస్ రోడ్డులో వెహికల్స్?ను పోలీసులు పంపిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఫైర్ సిబ్బంది ఫోమ్ స్ప్రే చేస్తున్నారు. ఈ ఘటనలో రెండు కార్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కారులో ఉన్నవారికి గాయాలయ్యాయి. ట్యాంకర్ నుంచి పెట్రోల్ లీక్ అవుతుండటంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. డ్రైవర్ పెట్రోల్ ట్యాంకర్‌లో ఇరుక్కుపోయాడు. జాతీయ రహదారి 65పై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్

**ఆదిలాబాద్, జూన్ 4 :** ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది . ఎయిర్ పోర్టుకు 1580 ఎకరాలు ఇవ్వడానికి సిద్ధమైన రాష్ట్ర సర్కార్ ప్రతిపాదన లేఖను రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ మహంతికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అందించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లేఖ పట్ల సానుకూలత తెలిపింది కేంద్రం. రక్షణ శాఖ చెందిన 400 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే1580 ఎకరాలు కలిపి1980 ఎకరాల్లో ఎయిర్ ఫోర్స్ స్టేషన్, ఎయిర్ పోర్టు నిర్మాణానికి సానుకూలంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. కేంద్రం నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై సానుకూలంగా ఉన్న ప్రధాని మోడీ, సీఎం రేవంత్ కు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.




# బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

## బీటెక్ విద్యార్థి మృతి

**హైదరాబాద్, జూన్ 4 :** నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఇదే ఓ విద్యార్థి ప్రాణాలు పోవడానికి కారణమైంది. సికింద్రాబాద్ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలో కురిసిన వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఈ క్రమంలో బైకుపై వస్తున్న ఓ యువకుడు స్కిడ్ అయి.. అదే సమయంలో పక్కనే వెళ్తున్న ఆర్టీసీ బస్సు కిందికి దూసుకుపోయాడు. బస్సు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మార్కెట్ స్టేషన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు గురునానక్ కాలేజీలో బీటెక్ చదువుతున్న మదన్ మోహన్‌గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మదన్ మోహన్ అకాల మరణంతో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# రైతుల ఇబ్బందులను పట్టించుకోని సిఎం

## పర్యటనలతో ఒరిగేదేమీ లేదు : నిరంజన్ రెడ్డి

**వనపర్తి, జూన్ 4 :** రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడ్డ సమయంలో కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల సందర్శన పేరుతో హడావుడి చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. సీఎం గురువారం పాలమూరు పర్యటన సందర్భంగా పలు ప్రశ్నలు సంధించారు. విపత్తుల సమయంలో రాకుండా , రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న ఈ పర్యటనలు ఎవరికి ఉపయోగమని నిలదీశారు. సీఎం పర్యటనే వేళ తెలంగాణ వాదులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం సబబు కాదని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ వడ్లు కల్లాల్లోనే ఉన్నాయని,రైతు భరోసా అడుగుతారనే హెలికాప్టర్‌లో పర్యటిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు ఆశలు కోల్పోయారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, భవిష్యత్తులో వారికి పరాభవం తప్పదని హెచ్చరించారు.

# ఆస్పత్రిలో మృతురాలి మెడలో పుస్తెలతాడు మాయం

## పోలీసులకు ఫిర్యాదు చేసిన బంధువులు

**యాదాద్రి భువనగిరి ,జూన్4 :** భువనగిరిలో దారుణం జరిగింది. మృతదేహంపై ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడును దుండగులు మాయం చేశారు. భువనగిరి జిల్లా ఆసుపత్రిలో చనిపోయిన మహిళ మెడ నుంచి మూడు తులాల బంగారు పుస్తెల తాడు మాయమైన ఘటన కలకలం రేపింది. వలిగొండ మండలం వర్కట్ పల్లికి చెందిన సుష్మిత అనే గర్భవతికి దమ్ము ఎక్కువగా వస్తుండటంతో అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆమె భర్త నాగరాజు ఆమెను జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చాడు. తెల్లవారుజామున నాలుగు గంటలకు సుష్మిత చికిత్స పొందుతూ చనిపోయింది. పోస్టుమార్టం సమయంలో సుష్మితపై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకోండని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆమె ఒంటిపై ఉన్న బంగారం గురించి చూడగా.. అప్పటికే ఆమె మెడలోని మూడు తులాల పుస్తెలా తాడు కనిపించలేదు. ఈ ఘటనపై.. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు పోలీసులకు సుష్మిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయం!



**తెలంగాణను ముంచిన వారంతా ఇప్పుడు వీరతాళ్లు వేసుకుని.. నా తెలంగాణ అంటూ ఊరేగుతున్నారు. విగ్రహాల పేరుతో కొందరు నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డదని వాపోతున్నారు. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కోసం మళ్లీ రాజకీయ రగడ మొదలయ్యింది. ఎవరికి వారు తామే తెలంగాణ భావి విధాతలమని మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరిగిన ద్రోహం, అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఉమ్మడి ఎపిలో జరగనంత దోపిడీ గత 12 ఏళ్లుగా సాగుతోంది. ఎక్కడిక్కడ భూములు దోచుకున్నారు. అప్పల చేసి దోచుకున్నారు. తెలంగాణను అప్పల కుప్పచేసి అనుభవిస్తున్నారు. ఎవరికి వారు తామే తెలంగాణను ఉద్దరించామని చెప్పకుంటున్నారు.**

నిరుద్యోగ సమస్య తీరలేదు. నీటి సమస్యలు తీరలేదు. నిధులు పారించలేదు. అంతెందుకు రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరలకు కొని సేకరణ సక్రమంగా చేయడంలో కూడా విఫలం అయ్యారు. మక్క, జొన్న, మిర్చి, పత్తి రైతులు ఏటా పడుతున్న కష్టాలను పట్టించుకోని అసమర్థులుగా మిగిలి పోయారు. ఇకపోతే తెలంగాణలో కొత్తగా ఆస్తులు సృష్టించలేదు. అయినా పాలకులుగా పనిచేసిన వారు తామే తెలంగాణను ఉద్దరించామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రజలకు పెన్షన్లు, ఇళ్లు, ఆరోగ్యశ్రీలు ఎరగా వేసి దర్జాగా దోచేస్తున్నారు. నిజానికి ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణ విడివడ్డాక తెలంగాణ అభివృద్ధి చెందిందా..లేక అప్పుల పాలయ్యిందా అంటే..అప్పుల పాలయ్యిందని లెక్కలు చెబుతున్నాయి. సమయానికి జీతాలు ఇవ్వలేని వారు పాలకులు అయ్యారు. హైదరాబాద్ మీ అయ్య జాగీరా అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు ఒంటి కాలిపై లేచి..అవును మా అయ్య జాగీరే అంటున్నారు. ఎందుకంటే మూడో వ్యక్తి వస్తే..దోచుకోవడానికి అవకాశం ఉండదు కనుక... ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తున్నా వంటూ పవన్‌ను చీల్చి చెండాడేంత పని చేశారు. పవన్ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు నిజంగానే తెలంగాణలోని కొందరికి బాధ కలిగించాయి. అందులో అనుమానం లేదు. రాజకీయంగా తెలంగాణలో ఉన్న కొందరు జనసేనలోనూ ఉన్నారు. వారికి పదవులు రావాలంటే జనసేన పక్షాన పోటీ చేయాల్సిందే.

రాజకీయ పార్టీ అన్న తరవాత పోటీకి సై అంటుంది. జనసేన కూడా అదే చేసింది. అయితే మిగతా ప్రాంతాలకు, తెలంగాణకు ఓ రేఖ అడ్డంగా ఉంది. అదే సెంటిమెంట్. తెలంగాణ ప్రజలను ముంచిందే సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌తోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డది. అది అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్లు దర్జాగా తెలంగాణలో పాగా వేసి, ఇష్టారాజ్యంగా దోచుకున్నది. పదవులు, డబ్బులు, భూములు దోచేసారు. లక్షల కోట్లు తెలంగాణ నెత్తిన అప్పులు పెట్టారు. తరవాత గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. అభివృద్ధి పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు పప్పు బెల్లాల్లా తెలంగాణను పంచుకుంటున్నారు. భూములు యధేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ రాకతో మరోమారు సెటిమెంట్ రగిల్చి బాగుపడాలన్న ధోరణిలో పొన్నం ప్రభాకర్, కెటిఆర్, కవితలు తామే అసలుసిసలు తెలంగాణ వారుసులమని చెప్పుకునే ప్రయత్నంలో పడ్డారు. తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభంల పడుతున్నదనీ గొంతు చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్యం కిందకు వెళుతోందని ప్రకటించుకున్నారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనక బిజెపి, మోడీ ఉన్నారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కూడా భారతదేశంలోనే ఉందని, అందుకు బిజెపి ఎక్కడైనా పావులు కదుపుతుందని తెలుసుకోవాలి. బిజెపికి తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని తెలుసు. ఇక్కడ పాగా వేయాలని ఎప్పటనుంచో కలలు కంటోంది. కనుక దాని ప్రయత్నాల్లో అది ఉంది. ఇది రాజకీయం. కెసిఆర్ కూడా భారత రాష్ట్ర సమితి అంటూ దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగారు. దానిని ఎవరైనా తప్పుపట్టారా అన్నది కెటిఆర్ చెప్పాలి. రాజకీయ పార్టీ పెట్టి ఇక్కడ వైఎస్ షర్మిల కూడా పాదయాత్ర చేశారు. తాను తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నారు. అప్పుడు లేని రోషం ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం పెరిగింది. దానికి కెసిఆర్ ఆద్యులు. ఆయనే మాకు ఆంధ్రాతో పేచీ లేదంటూ..జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ భలయ్ చేసుకున్నారు. కృష్ణా నీటిని ఎపికి దోచి పెట్టారని వస్తున్న ఆరోపణలకు కెసిఆర్ బృందం నుంచి సమాధానం లేదు. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి వస్తున్నారని జనసేనాని పవన్ కళ్యాణ్‌ను విమర్శించే ముందు..ఇక్కడ ఎంత కొల్లగొట్టారో చెప్పాలి. ధరణి పేరుతో మోసాలు. కాళేశ్వరం పేరుతో దగా. టెలిఫోన్ ట్యాపింగ్. అస్మదీయులకు రాజ్యసభ పదవులు.. ఇలా చెప్పకుంటూ పోతే కథలు కోకొల్లలు.

ఇప్పుడు రెండేళ్ల పాలనలో మంత్రులందరిపైనా అవినీతి గుప్పు మంటోంది. అయినా ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. తెలంగాణ మేధావులు నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వచ్చాకనే స్వేచ్ఛ వచ్చిందని కోదండరామ్ సార్ అంటున్నారు. అంటే కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలనలో మగ్గామనే అర్థం కదా. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో, మోదీ, చంద్రబాబుల ఉమ్మడి ప్రణాళిక దాగి ఉందని ఘోషిస్తున్న వారు, ఏ రకమైన దాడి జరిగిందో చెప్పాలి. ఈ గడ్డపై నివసిస్తూ ఇక్కడే మమేకమైన వారంతా తెలంగాణ బిడ్డలే. వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి. రాజకీయ పార్టీలు అన్ని చోట్లా తమ అస్తిత్వం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. కెసిఆర్ కుటుంబానికి చెందిన పార్టీలే తెలంగాణకు ప్రతినిధులు కాదు. తెలంగాణ కోసం కష్టపడే వారు ఎవరైనా రాజకీయలు చేసుకునే హక్కు ఉంటుంది. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనిని తప్పుపట్టడానికి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చలాయించిన సమైక్య పాలకులు, తెలంగాణ ఏర్పాటుతో అధికారం చేపట్టిన వారు కూడా తెలంగాణను నిలువునా దోచుకున్నారు. కాబట్టి ఎవ్వరు కూడా తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడలేదు. తమ స్వార్థ రాజకీయం కోసమే పోరాడారు. ఇంకా పోరాడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇదే సెంటిమెంటుతో తమ ఉనికి కోసం కొందరు ఇప్పుడు నానా యాగీ చేస్తున్నారని గుర్తిస్తే మంచిది.

# పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

- మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి
- ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు



**హైదరాబాద్, జూన్ 4 :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కళ్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని అన్నారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు. మున్ముందు బిజెపి తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

# అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

- కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు
- ఆస్తి, ప్రాణనష్టంపై అందని వివరాలు
- రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్లు, పోలీసులు
- అమిరోపేట-ఎస్సార్ నగర్ మధ్య ట్రాఫిక్ క్రమబద్ధీకరణ



**హైదరాబాద్, జూన్ 4 :** హైదరాబాద్ అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ – 1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దట్టమైన పొగ కారణంగా పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా అమిర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు అమిర్‌పేట– ఎస్సార్‌నగర్ మార్గాన్ని తాత్కాలికంగా నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. అలాగే విధుల్లో ఉన్న ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

# భవిష్యత్తు అవసరాలకు పెట్టుబడి

**గూగుల్ తీరును అభినందించిన ఉదయ్ కోటక్**

**ముంబై, జూన్ 4 :** కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ తాజాగా భారతీయ వ్యాపార సంస్థలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దిగ్గజ కార్పొరేట్ సంస్థలు వేల కోట్లను ఆర్జిస్తున్నప్పటికీ సంతృప్తి చెందకుండా భవిష్యత్తుపై పెట్టుబడులు పెడుతున్న వైనాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా గూగుల్ గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సంస్థ ఆర్థిక సామర్థ్యం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందని అన్నారు. 'గూగుల్ వార్షిక లాభం 160 బిలియన్ డాలర్లు. గత త్రైమాసికంలో 62 బిలియన్‌లను ఆర్జించింది. సంస్థ మార్కెట్ విలువ 4.5 ట్రిలియన్‌లు. భారతీయ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్, లాభాల కంటే ఇది ఎక్కువ. ఇది భారతీయ కంపెనీలకు మేలు కొలుపు కావాలి. ప్రస్తుత పరిస్థితి ఎంత మెరుగ్గా ఉన్నప్పటికీ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టాలి' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పోస్టు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. కృత్రిమ మేధపై పెట్టుబడుల కోసం ఇటీవల గూగుల్ ఏకంగా 80 బిలియన్ డాలర్లను సేకరించేందుకు ప్రణాళిక ఆవిష్కరించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించింది. ప్రభుత్వాలు నిధుల సేకరణ జరిపే స్థాయిలో ఒక కార్పొరేట్ కంపెనీ దీర్ఘకాలిక వ్యూహంతో నిధులు సేకరించడంతో పెద్ద చర్చకు దారి తీసింది.

# ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి డిమాండ్**



**జగిత్యాల, జూన్ 4 :** రాష్ట్ర ప్రజానికంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆరోపించారు. వానకాలం పంట సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతున్నా గాని ప్రభుత్వానికి ముందస్తు కార్యచరణ ప్రణాళికను ఇంకా తయారు చేసుకోలేదని వెల్లడించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు సంబంధించి కార్యచరణను ఇంకా రూపొందించ లేదని ఆరోపించారు. కనీసం ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా మూడు సంవత్సరాల కాలంలో ఆరు పంటలు పండాయని, ఇందులో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించారో ఆయన ఆత్మకే తెలుసని విమర్శించారు. ధాన్యం సేకరణపై కాంగ్రెస్ , బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రైతు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. పప్పు దినుసులు, నూనె గింజలు పండించాలని సలహా ఇస్తున్న ప్రభుత్వం వాటికి ఏ విధమైన ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పడం లేదని పేర్కొన్నారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడేందుకు కోతుల పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని, తక్షణమే రైతుకు సోలార్ ఫెన్సింగ్ 50 శాతం రాయితీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేదని, యూరియా యాప్‌ను తొలగించి నేరుగా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



# కేరళను తాకిని నైరుతి రుతుపవనం

**మరో వారం రోజుల్లో తెలంగాణకు రాక**

**తిరువనంతపురం, జూన్ 4 :** ఇంతకాలం మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా చల్లని కబురు వచ్చేసింది. కేరళకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. దాంతో కేరళ తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక అక్కడ ఇనుంచి తమిళనాడు, కర్నాటక,ఆంధ్రాలకు విస్తరిస్తాయి. మరో వారంలోపే ఈ రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యంగా వచ్చాయి. వాస్తవానికి మే 26వ తేదీననే నైరుతి రుతపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసింది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందుల య్యాయి. కాగా రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో అటు తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిక జారీచేసింది. ఇదిలావుంటే.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్–సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90శాతం వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

# రేవంత్ పర్యటన.. ముందుస్తు అరెస్టులు

**జోగులాంబగద్వాల, జూన్ 4 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం గద్వాల జిల్లాలో పర్యటన సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. గద్వాల నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు నాయుడును పోలీసులు అర్ధరాత్రి నుంచి హౌస్ అరెస్ట్ చేశారు. అదేవిధంగా పార్టీ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్ రాములు, కురువపల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్‌ను అరెస్టు చేయడం పట్ల హనుమంతు నాయుడు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో పోలీస్‌ల పహారాలు, నిర్బంధాలు ఎందుకని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అంటూ బీరాలు పలుకుతూ ప్రతిపక్ష నాయకు లపై ఆంక్షలు ఎందుకని నిలదీశారు. మూడు సంవత్సరాల పాలనకే ఇంత అభద్రతాభావమా.. ఇంతటి అరాచకమా? అని మండిపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రతిపక్ష పార్టీల సూచనలను, ప్రజల ఆలోచనలను పరిగణనలోకి తీసుకోకుండా హడావుడిగా ప్రాజెక్టుల సందర్శన చేపట్టడం విచారకరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండించారు.



## ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు డా. సింధూజ, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్యామ్ సుందర్ బుధవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. కార్యకర్తలు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.



## మల్కాజ్‌గిరి నూతన సీపీ సుమతికి ఎమ్మెల్యే శ్రీగణేష్ శుభాకాంక్షలు

**మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే శ్రీగణేష్**

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సుమతి ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని శాంతిభద్రతల పరిస్థితులు, డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం మరియు సరఫరాను అరికట్టేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలపై ఎమ్మెల్యే సీపీతో చర్చించారు. యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాల వ్యాప్తిని పూర్తిగా నిర్మూలించేందుకు ఉక్కుపాదం మోపాలని, నేరాల నియంత్రణకు మరింత పటిష్ట చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే శ్రీగణేష్ కోరారు. ప్రజల భద్రత, శాంతియుత వాతావరణ పరిరక్షణలో పోలీస్ శాఖకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. సీపీ సుమతి కూడా ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు.



## రైతులు ఎఫ్.ఎస్.ఎస్ యాప్‌ను వినియోగించుకోవాలి

**మేడ్చల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని చంద్రకళ**

**మేడ్చల్, నేడు న్యూస్:** మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం అలియాబాద్ రైతు వేదికలో గురువారం మండల ఎరువుల డీలర్లకు కొత్త ఎరువుల అమ్మకాల యాప్ ఎఫ్.ఎస్.ఎస్ యాప్ పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో డీలర్స్, రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు కు ఈ కొత్త యాప్ పై శిక్షణ ఇచ్చారు. తెలంగాణలో ఈ ఎఫ్.ఎస్.ఎస్. యాప్ ను మేడ్చల్ - మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలలో అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ మాట్లాడుతూ, రైతులు అందరూ ఈ కొత్త యాప్ ద్వారానే అన్ని రకాల ఎరువులు కొనుగోలు చేయాలి సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట వ్యవసాయ అధికారి రమేశ్, దుండిగల్ వ్యవసాయ అధికారి యాదగిరి, బాలానగర్ వ్యవసాయ అధికారి సాయి రమేష్, అలాగే ఉప్పల్ వ్యవసాయ అధికారి కృపాకర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు సుధీర్ కుమార్, శ్రీనాథ్ లు పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు జన్మదిన వేడుకలు

**కూకట్‌పల్లి, నేడు న్యూస్:** శేర్లింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు జన్మదిన వేడుకలు కూకట్‌పల్లి బాలకృష్ణనగర్‌లోని వృద్ధి బ్యాంక్వెట్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, గొట్టుముకుల వెంగళరావు, మందాడి శ్రీనివాసరావు, తూము శ్రవణ్ కుమార్, ఆవుల రవీందర్ రెడ్డి, నవత రెడ్డి, సాయిబాబా, ముద్దాపురం నరసింహ యాదవ్, కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా, గౌసుద్దీన్ తదితరులు హాజరై మాధవరం రంగారావుతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాధవరం రంగారావు మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మహిళా నాయకులు మరియు అభిమానులకు పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ప్రేమాభిమానాలు తనకు మరింత బాధ్యతను పెంచాయని, భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో ముందుండి పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొట్టుముకుల పెద్ద భాస్కర్ రావు, భద్రయ్య, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సంతోష్, ప్రభాకర్, తులసీరావు, ఆనంద్ రావు పాల్గొని మాధవరం రంగారావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రకృతిలోనే భవిష్యత్తు

- పర్యావరణ పరిరక్షణే మానవాళి మనుగడకు మార్గం
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం
- 'ప్రకృతిని జయించాలని ప్రయత్నిస్తున్న మనిషి. చివరికి తన మనుగడనే ప్రమాదంలోకి నెట్టుకుంటున్నాడు'

**హైదరాబాద్, నేడు ప్రతినిధి:**

**భూమిపై జీవం మనుగడ సాగించడానికి ప్రకృతే ప్రధాన ఆధారం. మనం పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం, సాగు చేసే భూమి, జీవించడానికి అవసరమైన ప్రతి వనరు ప్రకృతి ప్రసాదమే. అయితే అభివృద్ధి, ఆధునీకరణ, పారిశ్రామికీకరణ పేరుతో మనిషి ప్రకృతిని విచక్షణారహితంగా దోచుకుంటూ భవిష్యత్ తరాల హక్కులను హరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో జూన్ 5న జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవం కేవలం ఒక ఉత్సవం కాదు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన అత్యవసరతను గుర్తుచేసే ప్రపంచ హెచ్చరిక.**

### పర్యావరణ సంక్షోభం ముంచుకొస్తోంది

నేడు ప్రపంచం వాతావరణ మార్పుల తీవ్ర ప్రభావాలను ఎదుర్కొంటోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అసమయ వర్షాలు, వరదలు, కరువులు, తుఫానులు, హిమనదాల కరుగుదల, సముద్ర మట్టాల పెరుగుదల – ఇవన్నీ ప్రకృతి అసమతుల్యతకు నిదర్శనాలు. ఒకప్పుడు వందేళ్లకు ఒకసారి సంభవించే ప్రకృతి వైపరీత్యాలు నేడు ప్రతి సంవత్సరం కనిపిస్తున్నాయి. రైతు పంటలు నష్టపోతున్నాయి. నీటి వనరులు క్షీణిస్తున్నాయి. జీవవైవిధ్యం ప్రమాదంలో పడుతోంది. ఇది కేవలం పర్యావరణ సమస్య కాదు. ఆర్థిక, సామాజిక, ఆరోగ్య సంక్షోభం కూడా.

### ప్రకృతి నుంచే స్ఫూర్తి... భవిష్యత్తుకు భరోసా

ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం 'ప్రకృతి నుంచే పరిష్కారాలు' అనే సందేశాన్ని ఇస్తోంది. ప్రకృతిని నాశనం చేయడం కాదు, ప్రకృతితో కలిసి జీవించడం నేర్చుకోవాల్సిన సమయం ఇది.



అడవులను కాపాడడం, చెట్లను పెంచడం, జీవవైవిధ్యాన్ని సంరక్షించడం, నీటి వనరులను రక్షించడం, పునరుత్పాదక శక్తి వనరులను ప్రోత్సహించడం వంటి చర్యలే వాతావరణ సంక్షోభానికి దీర్ఘకాలిక పరిష్కారాలు.

### ప్లాస్టిక్ కాలుష్యం - కనిపించని విపత్తు

మన దైనందిన జీవితంలో భాగమైన ప్లాస్టిక్ నేడు ప్రకృతికి అతిపెద్ద శత్రువుగా మారింది. నదులు, చెరువులు, సముద్రాలు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. మైక్రోప్లాస్టిక్‌లు నేలల్లో, నీటిలో, ఆహారంలోకి చేరి మానవ ఆరోగ్యానికే ముప్పుగా మారుతున్నాయి. ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిరాకరించకపోతే రాబోయే తరాలు మరింత తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

### రైతు - పర్యావరణ రక్షకుడు

పర్యావరణ పరిరక్షణలో రైతు పాత్ర అత్యంత కీలకం. భూమి ఆరోగ్యంగా ఉంటేనే వ్యవసాయం ఆరోగ్యంగా ఉంటుంది. అధిక రసాయన వినియోగం భూమి సారాన్ని తగ్గించడమే కాకుండా నీటి కాలుష్యానికి కూడా కారణమవుతోంది. సేంద్రియ వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, జీవ ఎరువులు, జీవ పురుగుమందుల వినియోగం వంటి పద్ధతులు భూమిని కాపాడటమే కాకుండా రైతు ఖర్చులను తగ్గించి స్థిరమైన ఆదాయాన్ని అందించగలవు.

### ప్రతి ఒక్కరి చేతుల్లోనే పరిష్కారం

పర్యావరణ పరిరక్షణ కోసం పెద్ద ప్రాజెక్టుల కంటే పెద్ద మనసు అవసరం. ఒక్క మొక్క నాటడం... ఒక్క ప్లాస్టిక్ కవర్‌ను తిరస్కరించడం... ఒక్క బకెట్ నీటిని ఆదా చేయడం... ఒక్క కుటుంబానికి అవగాహన కల్పించడం... ఇలాంటి చిన్న చర్యలే పెద్ద మార్పులకు పునాది వేస్తాయి.

### భావితరాలకు మనం ఇచ్చే వారసత్వం ఏమిటి?

భూమి మన పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తి కాదు. మన పిల్లల నుంచి తీసుకున్న అప్పు. ఆ అప్పును తీర్చే బాధ్యత మనందరిదీ. ప్రపంచం ఎంత సాంకేతికంగా అభివృద్ధి చెందినా ప్రకృతికి ప్రత్యామ్నాయం లేదు. మనిషి ప్రకృతిలో భాగమే కానీ ప్రకృతికి యజమాని కాదు. ప్రకృతిని రక్షించడం అంటే చెట్లు, నదులు, పక్షులను మాత్రమే కాదు – మన కుటుంబాలను, మన సమాజాన్ని, మన భవిష్యత్తును రక్షించడం. ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మనమందరం ఒక సంకల్పం చేద్దాం... "ప్రకృతిని ప్రేమిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం... పచ్చని భూమిని భావితరాలకు అందిద్దాం."

**"నేచర్ లేనిదే ఫ్యూచర్ లేదు... ప్రకృతి ఉంటేనే ప్రగతి ఉంటుంది."**



– జి. అజయ్ కుమార్
వ్యవసాయ, సామాజిక విశ్లేషకులు


## మేడ్చల్ మెడినోవా హాస్పిటల్‌లో అరుదైన కిడ్నీ శస్త్రచికిత్స విజయం

- పుట్టుకతో వచ్చిన లోపంతో పాటు పెద్ద రాయి (స్టాగ్ హార్న్) గుర్తింపు
- ఒకేసారి మూడు ఆపరేషన్లు చేసి రోగి ప్రాణాలు కాపాడిన డాక్టర్ బి నితేష్ బృందం



**మేడ్చల్, నేడు న్యూస్ :** పుట్టుకతో వచ్చిన కిడ్నీ లోపంతో పాటు తీవ్రమైన అంతర్గత సమస్యలతో బాధపడుతున్న ఒక యువకుడికి మేడ్చల్ పట్టణంలోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. స్థానికంగానే కార్పొరేట్ స్థాయి అత్యాధునిక వైద్యం అందించి రోగికి పునర్జన్మ ప్రసాదించారు. హాస్పిటల్ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణానికి చెందిన నవీన్ చారి (37) అనే యువకుడు ఎడమ వైపు నడుము, పొత్తికడుపు నొప్పితో బాధపడుతూ మెడినోవా హాస్పిటల్‌ను ఆశ్రయించారు. హాస్పిటల్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్ మరియు జనరల్ సర్జన్ డాక్టర్ బి.నితేష్ రోగికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగికి పుట్టుకతోనే ఎడమ కిడ్నీ నుండి ఒకటికి బదులు రెండు మూత్రనాళాలు ఉండటం వల్ల మూత్ర ప్రవాహానికి తీవ్ర అడ్డంకి ఏర్పడింది. దీనికి తోడు, అదే కిడ్నీలో మూత్రాన్ని సేకరించే భాగాన్ని పూర్తిగా అడ్డుకుంటూ పెద్ద పరిమాణంలో ఉన్న 'స్టాగ్ హార్న్' రాయి పేరుకుపోయింది. దీంతో పరిస్థితి తీవ్రతను గమనించిన డాక్టర్ బి.నితేష్ నేతృత్వంలోని వైద్య నిపుణుల బృందం రోగి ప్రాణాలను కాపాడేందుకు సుదీర్ఘమైన శస్త్రచికిత్స చేపట్టారు. ఓపెన్ పైలోలిథోటమీ ద్వార కిడ్నీలో ఉన్న భారీ స్టాగ్ హార్న్ రాయిని సురక్షితంగా తొలగించారు. ఆండర్సన్-హైన్స్ పైలోప్లాస్టీ ద్వార పుట్టుకతో వచ్చిన లోపాన్ని సరిచేస్తూ, అదనంగా ఉన్న రెండో మూత్రనాళాన్ని తొలగించి ప్రవాహ అడ్డంకులను తొలగించారు. డీజే స్టెంటింగ్ తో అంతర్గత వ్యవస్థ సజావుగా సాగడానికి తాత్కాలికంగా స్టెంట్ అమర్చారు. ఆపరేషన్ అనంతరం వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణ, నొప్పి నివారణ చికిత్సతో రోగి వేగంగా కోలుకున్నారు. ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగుపడటంతో ఆయనను హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా ఒకే రోగిలో పుట్టుకతో వచ్చిన లోపంతో పాటు, కిడ్నీని పూర్తిగా మూసివేసే అంత పెద్ద రాయి ఏర్పడటం చాలా అరుదు. ఈ క్లిష్ట పరిస్థితిని మా వైద్య బృందం సమగ్రంగా పరిశీలించి, ఒకేసారి మూడు శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశాం. మేడ్చల్ పరిసర ప్రాంతాల ప్రజలకు ఇలాంటి అత్యాధునిక కిడ్నీ సంబంధిత వైద్య సేవలను మెడినోవా హాస్పిటల్‌లో అందుబాటులోకి తెచ్చామని డా. బి నితేష్, ప్రముఖ యూరాలజీ నిపుణులు పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు జంపన ప్రతాప్ శుభాకాంక్షలు



**సికింద్రాబాద్, నేడు న్యూస్:** కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికై రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు కంటోన్మెంట్ కాంగ్రెస్ నేత, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ గురువారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బోయిన్‌పల్లిలోని జంపన ప్రతాప్ నివాసాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు జంపన కుటుంబ సభ్యులు, జంపన యువసేన ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జంపన దంపతులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి, మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే శ్రీగణేష్ చేస్తున్న కృషిని జంపన ప్రతాప్ ప్రశంసించారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, భవిష్యత్ అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే శ్రీగణేష్‌తో జంపన ప్రతాప్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జంపన కుటుంబ సభ్యులు, జంపన యువసేన నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం అత్యవసరం

**మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**




**మేడ్చల్ నేడు బ్యూరో:** పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ సందేశాలను విస్తృతంగా ప్రజలకు చేరవేసే ప్రక్రియలో భాగంగా, ఈ పోస్టర్లను కలెక్టరేట్‌తో పాటు జిల్లా పరిధిలోని అన్ని స్థానిక సంస్థల కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక – 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ అవగాహన వాల్ పోస్టర్లను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, ఈ పర్యావరణ అవగాహన పోస్టర్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు, అలాగే ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలు--2026 ప్రకారం నాలుగు రకాల వ్యర్థాల వేరు చేయడం (సెగ్రిగేషన్) కోసం రంగుల వారీగా నిర్దేశించిన డస్ట్‌బిన్ల వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించే సందేశాలు పొందుపరిచారన్నారు. తద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతాభావం పెంపొందించి, స్వచ్ఛమైన, హరితమైన, స్థిరమైన పర్యావరణ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి మేడ్చల్ జిల్లా పర్యావరణ ఇంజనీర్ బి. రాజేందర్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ లింగయ్య పాల్గొన్నారు.

## బల్క్ గార్బేజీ యూనిట్ల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- ఎం.ఎం.సి అడిషనల్ కమిషనర్ సి.ఎన్. రఘుప్రసాద్
- కాప్రా నుంచి డ్రైవ్ మొదలైందని వెల్లడి



**మేడ్చల్ నేడు బ్యూరో:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెత్తను పెద్ద మొత్తంలో వెలువరిస్తున్న వాణిజ్య సంస్థలు ఏవైనా సరే, ఇక నుంచి తమ సంస్థ పేరును ఆన్ లైన్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి అని ఎం.ఎం.సి అడిషనల్ కమిషనర్ ( హెల్త్, శానిటేషన్, యు.సి.డి, ట్రాన్స్ పోర్ట్ ) సి.ఎన్. రఘు ప్రసాద్ అన్నారు. గురువారం తన ఛాంబర్ లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, ఇందుకు సంబంధించి సుప్రీం కోర్టు ఆదేశాలు కూడా ఉన్నాయన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా, ఓనర్లు ఎవరికి వారే స్వచ్ఛందంగా తమ పేరు, తమ సంస్థ పేరు, మెయిల్ అడ్రస్, మొబైల్ నెంబర్ తదితర వివరాలను సెంట్రలైజ్డ్ పోర్టల్ ఫర్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ (సీపీసీ) పోర్టల్ https://sem.CPCB.gov.inలో నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన స్పెషల్ డ్రైవ్ ప్రారంభమైందని ఆయన వెల్లడిస్తూ, గురువారం కాప్రాలో జూన్ 4న ఈ డ్రైవ్ ను ప్రారంభించినట్టు తెలిపారు. ఆన్ లైన్ సీ.పీ.సీ పోర్టల్ లింక్ ను ఓపెన్ చేయాగానే ఓ.టీ.పీ, వస్తుందని వివరాలు నమోదు చేయగానే, ఎకనాలెడ్మెంట్ సర్టిఫికెట్ కూడా వస్తుందన్నారు. ఇది మెుత్తంగా ఫ్రీ ఆఫ్ కాస్ట్ అని, ఈ డ్రైవ్ ను గురువారం కాప్రా నుంచి తానే మొదలు పెట్టానని అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ వివరించారు.

## సీఎం ఓవర్సీస్ స్కాలర్షిప్‌కు మైనార్టీ విద్యార్థుల ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

**మేడ్చల్ నేడు బ్యూరో:** విద్యా సంవత్సరం 2026 (స్ప్రింగ్ కాలం) అడ్మిషన్లకు సంబందించి విదేశీ విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, డాక్టోరల్ కోర్సులను అభ్యసించడానికి స్కాలర్షిప్, ఆర్థిక సహాయం మంజూరు కోసం అర్హత గల మైనారిటీ విద్యార్థుల నుంచి ఆన్ లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మేడ్చల్ జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ కాంతమ్మ తెలిపారు. గురువారం ఆమె ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, విశ్వవిద్యాలయాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులలో ఫస్ట్ జూన్ 2026 నుంచి 30 జూన్ 2026 వరకు ప్రవేశం పొంది, అన్ని అర్హత ప్రమాణాలను పూర్తి చేసిన విద్యార్థులు www.telangana epass.cgg.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలనీ ఆమె సూచించారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసు లో హార్డ్ కాపీలు, అవసరమైన పత్రాలను సమర్పించడానికి చివరి తేది 31జులై 2026 వరకు ఉందన్నారు. అన్ని స్కీమ్ వివరాలు, అర్హత ప్రమాణాలు, దరఖాస్తు చేయాల్సిన దేశాలు, అర్హతలు, ఎంపిక కోసం తప్పనిసరి అవసరాలు విధానం ఈపాస్ వెబ్ సైట్ లో పొందుపరిచారన్నారు. అభ్యర్థులు తమ గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కు సంబంధించిన అసలు ట్రాన్స్ క్రిప్టను సంబందిత విశ్వవిద్యాలయాలు , కళాశాలల నుండి సమర్పించాలన్నారు. అలాగే, దరఖాస్తు ఫైళ్ల సమర్పణ సమయంలో తల్లిదండ్రులు సంబంధిత జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయానికి వ్యక్తిగతంగా హాజరు కావాలన్నారు. భవిష్యత్ సమాచార మార్పిడి కొరకు తల్లిదండ్రుల సంప్రదింపు నంబర్ ను ఆన్లైన్ దరఖాస్తులో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కార్యాలయంలో గానీ, 9866561235/ 9000168256ల లో కాని సంప్రదించ వచ్చున్నారు.

## నిర్మాణంలో ఉన్న భవనం పైనుండి పడి కార్మికుడు మృతి



**మేడ్చల్, నేడు న్యూస్ :** మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఒక ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న ఒక భవనంపై నుండి కింద పడి ఓ వలస కార్మికుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన దేవర రవి అనే వ్యక్తి ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. ఇక్కడ భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే మేడ్చల్ పరిధిలోని నవోదయ వెంచర్‌లో నిర్మాణంలో ఉన్న ఒక భవనంలోని 3వ అంతస్తులో రవి సెంట్రింగ్ పనులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి రవి పైనుంచి కింద పడిపోయాడు. తీవ్రమైన గాయాలు కావడంతో అతను ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే మేడ్చల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, అక్కడున్న ఇతర కార్మికులను విచారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్
- గుట్టకింద గుంపు అభివృద్ధి కి ఎమ్మెల్యే వరాల జల్లు
- రూ.10 కోట్లతో రెండు సైంటిఫిక్ గోడౌన్లకు శంకుస్థాపన
- సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం
- లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**కారేపల్లి, నేడు న్యూస్:** రైతుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అన్నారు. సింగరేణి మండలం గుట్టకింద గుంపు గ్రామ పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలను గురువారం ఆయన ప్రారంభించారు. వైరా నియోజకవర్గంలో వ్యవసాయాభివృద్ధి, గ్రామీణ మౌలిక సదు- పాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలులో భాగంగా గుట్టమీద ప్రాంతంలో అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.10 కోట్ల వ్యయంతో 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన రెండు ఆధునిక సైంటిఫిక్ గోడౌన్ల నిర్మాణానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.5 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను భద్రంగా నిల్వ చేసుకునేందుకు ఈ ఆధునిక గోడౌన్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గోడౌన్లు అందుబాటులోకి రావడంతో రైతులకు నిల్వ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు మార్కెటింగ్ వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన చెప్పారు. గోడౌన్ల నిర్మాణంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, వ్యవసాయ రంగానికి ఊతం లభిస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ చెప్పారు. అనంతరం కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. వడ్డుగూడెం గ్రామానికి చెందిన తోలేం లక్ష్మికి కళ్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన రూ.1 లక్ష చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. అలాగే పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసి ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తోందని తెలిపారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతుల అవసరాలకు అనుగుణంగా ఆధునిక గిడ్డంగుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని అన్నారు. సింగరేణి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధికారులు మాట్లాడుతూ.. గోడౌన్ల నిర్మాణం పూర్తయిన తర్వాత వైరా నియోజకవర్గ రైతులకు పంట నిల్వ, రవాణా, మార్కెటింగ్ సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. ఒకే రోజు గుట్టకింద గుంపు గ్రామంలో భారీ గోడౌన్ల నిర్మాణానికి శంకుస్థాపన, సీసీ రోడ్డు పనుల ప్రారంభం, సంక్షేమ పథకాల చెక్కుల పంపిణీ జరగడం గ్రామ చరిత్రలో ప్రత్యేక ఘట్టంగా నిలిచిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలను స్వాగతించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గిడ్డంగుల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్, వివిధ శాఖల డీఈలు, ఏఈలు, అధికారులు, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, మండల నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## రైతుల రాకపోకలకు ఇక స్వర్ణయుగం

### పోలంపల్లి-కోటిలింగాల బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే రాందాస్ నాయక్ శంకుస్థాపన

**కారేపల్లి నేడు న్యూస్:** పోలంపల్లి తండా ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పోలంపల్లి తండా రైతులు, గ్రామ ప్రజల చిరకాల కల ఎట్టకేలకు సాకారమైంది. పోలంపల్లి తండా నుంచి కోటిలింగాల శివాలయం వరకు అనేక గ్రామాలను అనుసంధానం చేస్తూ రైతులు, భక్తులు, గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగపడే బీటీ రోడ్డు నిర్మాణానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పోలంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్, దిశా కమిటీ సభ్యురాలు హేమలత బాలాజీ, గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ బద్రునాయక్, కారేపల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రంజిత్ కుమార్, రాష్ట్ర మహిళా నాయకురాలు పగడాల మంజుల, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, రైతు నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, , సీఐ సాగర్, ఎస్సై బి.గోపి, ఎంపీడీవో, ఎంపీఓ, ఉప సర్పంచ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రూ.2.70 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ బీటీ రోడ్డు పోలంపల్లి తండా అభివృద్ధికి మైలురాయిగా నిలవడంతో పాటు రైతుల జీవితాల్లో కొత్త ఆశలు నింపనుందని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



## నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన బానోత్ మనీషా లక్ష్మి

**కారేపల్లి, నేడు న్యూస్:** సింగరేణి మండల పరిధిలోని మాణిక్యం గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన వివాహ వేడుకల్లో వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి (మదన్ లాల్) పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. మాణిక్యం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ భూక్యా రంగారావు కుమారుడు భూక్యా ఈశ్వర్ – సాయి ధనుశ్రీల వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరైన మనీషా లక్ష్మి, నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు వాంకోడోత్ జగన్ నాయక్, ఉన్నం వీరేందర్, తుళ్లూరి వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీను, డొకేన రవీందర్, శంకర్, మాణిక్యం మాజీ సర్పంచ్ ధారావత్ కిషన్, శాంతి, రాజు, కడియాల రాజు, ధారావత్ వికాస్, జడల కళ్యాణ్, తెల్లగొల్ల రామారావు, పూర్ణ, ఉపేందర్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజల సందడితో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగాయి.

## వెంకటయ్యతండా యువ శాస్త్రవేత్తకు ప్రపంచ గుర్తింపు

### టాప్-2% జాబితాలో చోటు



**కారేపల్లి నేడు న్యూస్:** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం వెంకటయ్య తండాకు చెందిన యువ ఆహార శాస్త్రవేత్త డాక్టర్ వాంకడోత్ ప్రవీణ్ కుమార్ అరుదైన ఘనత సాధించారు. ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ పరిశోధనలు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలలో టాప్-2 శాతం జాబితాలో స్థానం సంపాదించి ఖమ్మం జిల్లా ప్రజలకు, ముఖ్యంగా గిరిజన సమాజానికి గర్వకారణంగా నిలిచారు. సాధారణ గ్రామీణ, గిరిజన నేపథ్యం నుంచి వచ్చిన డాక్టర్ ప్రవీణ్ కుమార్ తన ప్రతిభ, కృషి, అంకితభావంతో ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తల సరసన నిలవడం విశేషం. చిన్న తండాలో ప్రారంభమైన ఆయన విద్యా ప్రస్థానం నేడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది.

## బోయినచెరువు వద్ద సీసీ కెమెరాల ధ్వంసం

- గంజాయి ముఠాల ఆగడాలపై స్థానికుల ఆందోళన
- రాత్రి వేళల్లో పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు



**సికింద్రాబాద్, నేడు న్యూస్:** అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయిన చెరువు వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గుర్తుతెలియని యువకులు ధ్వంసం చేయడంతో స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గంజాయి సేవిస్తున్న కొందరు యువకులే తమ కార్యకలాపాలు బయటపడకుండా ఉండేందుకు కెమెరాలను విరగ్గొట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం వేళల్లో కుటుంబాలు, యువత, వాకింగ్‌కు వచ్చే ప్రజలతో సందడిగా ఉండే బోయిన చెరువు పరిసర ప్రాంతం ఇటీవల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. గంజాయి, మద్యం సేవిస్తూ కొందరు యువకులు బహిరంగంగా సంచరిస్తున్నారని, వారి ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో మద్యం మత్తులో తిరుగుతూ సమీప బస్తీల్లోకి వెళ్లి స్థానికులను బెదిరించడం, కత్తులు చూపించి భయభ్రాంతులకు గురిచేయడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా రాత్రి 10 గంటల తర్వాత బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందని తెలిపారు. ధ్వంసమైన సీసీ కెమెరాల దృశ్యాలను, గతంలో నమోదైన ఫుటేజీలను పరిశీలించి బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు. అలాగే బోయిన చెరువు పరిసర ప్రాంతంలో రాత్రి పహారా పెంచి గంజాయి, మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయులే నిజమైన హీరోలు: సునీల్ కుమార్

### విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



**సికింద్రాబాద్, నేడు న్యూస్:** ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడానికే పరిమితం కాకుండా, విద్యార్థుల జీవితాలకు మార్గదర్శకులుగా, స్ఫూర్తిదాతలుగా, విలువలను పెంపొందించే గురువులుగా నిలవాలని సీబీఎస్ఈ తెలంగాణ రీజినల్ ఆఫీసర్ సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణ సీబీఎస్ఈ రీజినల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన సునీల్ కుమార్ పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, బోధనా విధానాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం బోయిన్‌పల్లిలోని సీతారాంపురం సెయింట్ పీటర్స్ పాఠశాలను సందర్శించి పాఠశాల వసతులు, తరగతి గదుల నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక విద్యార్థి జీవితాన్ని పూర్తిగా మార్చే శక్తి ఉపాధ్యాయునికి మాత్రమే ఉంటుందని అన్నారు. పాఠశాల తరగతి గదుల్లో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించే బాధ్యత కూడా ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని, ప్రతి ఉపాధ్యాయుడు తన వృత్తిని సేవాభావంతో నిర్వర్తించి విద్యార్థుల జీవితాల్లో నిజమైన హీరోలుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అల్ఫోన్స్ రెడ్డి, డైరెక్టర్ అరుణ రెడ్డి, ప్రిన్సిపాల్ సువర్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వనాల పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

### ప్రకృతి వనాలు ధ్వంసమైతే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది: రావుల నాగేశ్వరావు



**కారేపల్లి, నేడు న్యూస్:** గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యులు రావుల నాగేశ్వరావు డిమాండ్ చేశారు. మాదారం గ్రామంలో ఆయన మాట్లాడుతూ, గతంలో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేసిన ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలు ప్రస్తుతం పెద్ద చెట్లుగా ఎదిగి గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందిస్తున్నాయని అన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ప్రకృతి వనాలను ధ్వంసం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వనాలు పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని, వాటి సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు కూడా ప్రకృతి వనాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



## గోవాలో పట్టుబడ్డ అంతర్రాష్ట్ర దొంగ

- రూ.82 లక్షల చోరీ సొత్తు రికవరీ
- మార్కెట్ పోలీసుల మాస్టర్ స్ట్రోక్.. 576 గ్రాముల బంగారం స్వాధీనం

**సికింద్రాబాద్, నేడు న్యూస్:** మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు. గోవాలో తలదాచుకున్న అంతర్రాష్ట్ర నేరస్థుడిని అరెస్ట్ చేసి, రూ.82 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. పాట్ మార్కెట్‌లోని శ్రీ సాయి బులియన్ జ్యువెలరీ షాపులో ఉద్యోగిగా పనిచేస్తున్న సందీప్ రఘునాథ్ చవాన్ ఈ నెల 27న విధుల్లో ఉండగా, తన ఇంటి తాళం పగులగొట్టి దొంగతనం జరిగినట్లు భార్య ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చింది. ఇంటికి చేరుకుని పరిశీలించగా, చెక్క పెట్టెను ధ్వంసం చేసి అందులోని బంగారు ఆభరణాలు, ఫైన్ గోల్డ్, వెండి వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు తేలింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, చోరీకి గురైన ఆస్తి సుమారు 576 గ్రాముల బంగారు ఆభరణాలు, ఫైన్ గోల్డ్‌తో పాటు 900 గ్రాముల వెండి వస్తువులు ఉన్నట్లు గుర్తించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.82 లక్షలుగా అంచనా వేశారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడి జాడను కనుగొని గోవాకు వెళ్లారు. జూన్ 1న ఉత్తర గోవాలోని కలంగూట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వ్యక్తిని ఢిల్లీకి చెందిన మనోజ్ సింగ్ (28)గా గుర్తించారు. అతని వద్ద నుంచి చోరీకి గురైన మొత్తం బంగారం, వెండి ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు ఢిల్లీలో 19కు పైగా గృహ చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అతనిపై పలు నాన్-బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని, గతంలో ఏడు కేసుల్లో అరెస్టై తీహార్ జైలులో కూడా శిక్ష అనుభవించినట్లు తెలిపారు. తదుపరి చర్యల కోసం ఢిల్లీ పోలీసులకు సమాచారం అందించారు. మల్కాజ్‌గిరి డివిజన్ ఏసీపీ వి. యాదగిరి రెడ్డి, మార్కెట్ ఇన్‌స్పెక్టర్ వి. రామ్‌చందర్ ఆధ్వర్యంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎం. బషీర్ అహ్మద్, ఎస్ఐలు చి. నరేష్, ఎ. నరేష్, చి. రవి తదితరులు ఈ కేసును ఛేదించారు. డీసీపీ మల్కాజ్‌గిరి జోన్ చి. శ్రీధర్ ఐపీఎస్ పర్యవేక్షణలో, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి ఐపీఎస్ మార్గదర్శకత్వంలో దర్యాప్తు నిర్వహించారు.

### .ప్రజలకు పోలీసుల సూచనలు

ఇళ్లకు భద్రతా చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని, సీసీ కెమెరాలు, సెంట్రల్ లాకింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఆమె సేవలు అభినందనీయం

- డీఈఓను కొనియాడిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు
- వీడుకోలు సభలో ప్రశంశలు అందుకున్న విజయకుమారి



**మేడ్చల్, నేడు బ్యూరో:** మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాకు డీ.ఈ.ఓగా విజయ కుమారి చేసిన సేవలు అభినందనీయమని జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు కొనియాడాయి. జిల్లా నుంచి బదిలీ అయిన డీఈఓ విజయ కుమారికి గురువారం జిల్లా కలెక్టరేట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ( టీ.జీ.ఈ.జే.ఏ.సీ)లు వీడుకోలు అభినందన సమావేశాన్ని నిర్వహించాయి. ఆమె జిల్లాకు చేసిన సేవలను పేర్కొంటూ, శాలువా కప్పి, వె-ుమెంటో అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ, కోవిడ్ లాక్ డౌన్ సమయంలోనూ విద్యార్థులకు ఆన్ లైన్ క్లాసులు నిర్వహించి, విద్యార్థులకు సేవలు అందించారని అభినందించారు. ఈ సందర్భంగా ఆమెకు జాతీయ స్థాయి అవార్డ్ కూడా దక్కిన విషయాన్ని గుర్తు చేస్తూ కొనియాడారు. అలాగే, జిల్లాలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులను సమన్వయం చేసుకుంటూ విద్యా వ్యవస్థను ముందుకు సాగించారన్నారు. చివరగా, డీఈవో విజయ కుమారి మాట్లాడుతూ, జిల్లాలో తనకు సహకరించిన ఉపాధ్యాయ, ఉద్యోగ, సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్జీవో సంగం అధ్యక్షులు బి.రవి ప్రకాష్, పీ.ఆర్.టీ.యు – టి.ఎస్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్, టీ.ఎస్ – యూటీఎఫ్ అధ్యక్షులు కె.జయ సింహ రెడ్డి, ఎస్.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్, టి.ఎస్.జి.హెచ్.ఎం.ఎ అధ్యక్షులు రాం రెడ్డి,ప్రధాన కార్యదర్శి మురళి, పి.ఆర్.టి.యు – టి.ఎస్ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, యు.టి.ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్ రెడ్డి, టి.ఎన్.జీ. వో జిల్లా కార్యదర్శి భరత్,కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలి

### పబ్లిక్ టాయిలెట్లు, బస్ షెల్టర్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి : బానోత్ దుర్గాప్రసాద్



**జూలూరుపాడు, నేడు న్యూస్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూ రుపాడు మండల కేంద్రంలో ప్రజలకు అత్యవసరమైన మౌలిక వసతులైన పబ్లిక్ టాయిలెట్లు, బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, 24 గ్రామపంచాయతీలకు కేంద్రంగా ఉన్న జూలూరుపాడులో ఇప్పటికీ సరైన పబ్లిక్ టాయిలెట్లు, బస్ షెల్టర్లు లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పబ్లిక్ టాయిలెట్లు, బస్ షెల్టర్ల నిర్మాణానికి పలుమార్లు శంకుస్థాపనలు జరిగినప్పటికీ, పనులు మాత్రం ముందుకు సాగడం లేదని విమర్శించారు. ఖమ్మం వెళ్లే మార్గంలోని వినోబా నగర్‌లో బస్టాండ్ నిర్మాణం చేపట్టినా పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదని, పడమటి నర్సాపురంలో ఉన్న బస్టాండ్ ఐదేళ్ల క్రితం కూల్చివేయబడినా ఇప్పటి వరకు పునర్నిర్మాణం జరగలేదన్నారు. మాచినేనిపేట తండా, కొమ్ముగూడెం వంటి గ్రామాల్లో బస్టాండ్లు ఉన్నప్పటికీ, మండల కేంద్రంలోనే ప్రయాణికులకు కనీస బస్ షెల్టర్ సౌకర్యం లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం కొనసాగిస్తే ప్రజలను ఐక్యం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బానోత్ దుర్గాప్రసాద్ హెచ్చరించారు.

## సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా

### 'బుక్ మై షో'లో గంటకు 40వేల టికెట్స్ బుక్

ప్రస్తుతం సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా కనిపిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వాటిని అందుకొని హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకువచ్చిన విషయం తెలిసిందే. రిలీజ్‌కు ముందు నుంచే టికెట్ బుకింగ్స్‌లో జోరు చూపిన చిత్రం విడుదల అనంతరం కూడా అదే కొనసాగిస్తోంది. ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ 'బుక్ మై షో'లో 'పెద్ది'కు గంటకు 40వేల టికెట్స్ బుక్ అవుతున్నాయి. 2023లో బుక్‌మై షో ప్రవేశపెట్టిన 'అవర్లీ ట్రెండింగ్' ఫీచర్ తర్వాత.. ఈ 40 వేల మార్క్‌ను దాటిన చిత్రాల జాబితాలో ఇప్పటివరకు మూడు సినిమాలు మాత్రమే ఉన్నాయి. కల్కి 2898 ఏడీ, సలార్, పుష్ప తర్వాత స్థానంలో 'పెద్ది' నిలిచింది. మొదటిరోజే ఈ మార్క్‌ను చేరుకొని రికార్డు సృష్టించింది. కర్ణాటకలో జరిగిన ప్రీమియర్ షోల ద్వారా 'పెద్ది' భారీ వసూళ్లను సాధించి, టాలీవుడ్‌లోని పలు అగ్రహీరోల చిత్రాల రికార్డులను తిరగరాసింది. ప్రీమియర్స్‌లో రూ. 3.2 కోట్లు వసూలు చేసినట్లు సినీ వర్గాలు తెలిపాయి. దీంతో అక్కడ ప్రీమియర్ కలెక్షన్స్ సాధించిన మొదటి తెలుగు సినిమాగా నిలిచింది. గతంలో విడుదలైన 'ఓజీ' (రూ. 2.72 కోట్లు), 'రాజా సాబ్' (రూ. 2.61 కోట్లు), పుష్ప 2 (రూ. 2.55 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించిన ఈ సినిమాలో పాటలు కూడా సూపర్ హిట్‌గా నిలిచాయి. ముఖ్యంగా 'చికిరి చికిరి' పాట విడుదలైన రెండు వారాలకే 10 కోట్లకు పైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలిచింది. అయితే, ఈ పాట లిరిక్స్‌లో 'సరుకూ సామాన్లు' అనే పదంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేయడంతో టీమ్ ఈ పదాన్ని మార్చినట్లు తెలుస్తోంది. థియేటర్‌లలో దీనికి బదులుగా 'సొగసు సింగారం' అని చేర్చారని నెటిజన్లు పోస్ట్‌లు పెడుతున్నారు. ఈ స్పోర్ట్స్ డ్రామాకు ఏఆర్ రెహమాన్ సంగీతం హైలైట్‌గా నిలిచింది

## నా మనసంతా పెద్ది చుట్టే తిరుగుతోంది

### పెద్ది విజయంపై చిరంజీవి అభినందనలు


తాను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా తన మనసంతా 'పెద్ది' దగ్గరే ఉందని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' నేడు ప్రేక్షకుల ముందుకువచ్చి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఒక తండ్రిగా, నటుడిగా తనకెంతో గర్వంగా ఉందంటూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. ఈసందర్భంగా చిత్రబృందాన్ని అభినందించారు. నేను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా కూడా నా మనసంతా 'పెద్ది' దగ్గరే ఉంది. గత రెండేళ్లుగా ఈ సినిమా కోసం చరణ్ పడిన కష్టం, పెట్టిన శ్రద్ధాసక్తులు అన్నీ దగ్గర నుంచి చూశాను. ఈ రోజు ప్రేక్షకుల ప్రేమ, ప్రశంసలు చూస్తుంటే ఒక తండ్రిగా మాత్రమే కాదు, ఒక నటుడిగా కూడా ఎంతో గర్వంగా అనిపిస్తోంది. 'పెద్ది' పాత్రలో పూర్తిగా లీనం కావడానికి తను అహర్నిశలు చేసిన కృషి, పట్టుదల, నిజాయతీ ప్రతి సన్నివేశంలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ కష్టానికి దక్కిన ప్రతిఫలమే ఈ విజయం అని రామ్ చరణ్‌ను చిరంజీవి ప్రశంసించారు. ఇలాంటి అద్భుతమైన కథను రాసి, అంతే అద్భుతంగా తెరపై ఆవిష్కరించిన దర్శకుడు బుచ్చిబాబుకు ప్రత్యేక అభినందనలు. అలాగే తన తొలి చిత్రాన్నే ఇంత భారీ స్థాయిలో, ఎలాంటి రాజీ లేకుండా నిర్మించిన నిర్మాత వెంకట సతీశ్ కిలారుకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించిన నా మిత్రుడు, 'కరునాడ చక్రవర్తి' శివరాజ్ కుమార్‌కు, అప్పలసూరి పాత్రలో అద్భుతంగా జీవించిన నా సోదర సమానుడు జగపతిబాబుకు అభినందనలు. ఈ ఘన విజయం తెలుగు సినిమాకి గర్వంగా నిలవాలని, మరెన్నో మైలురాళ్లు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.



# పెద్ది.. ఓ ఛాంపియన్

**రివ్యూ**

**తెలుగు సినీ ప్రేక్షకులు అత్యంత ఆసక్తికరంగా ఎదురు చూసిన సినిమాల్లో 'పెద్ది' ఒకటి. రెండో సినిమానే రామ్‌చరణ్‌ను డైరెక్ట్ చేసే అవకాశం బుచ్చిబాబుకు రావడం, జాన్వీకపూర్ కథానాయికగా నటించడం, ఏఆర్ రెహమాన్ సంగీతం ఇలా అన్నీ ఈ సినిమాపై అంచనాలను పెంచాయి. మరి 'పెద్ది' ఆ అంచనాలను అందుకుందా? రామ్‌చరణ్‌కు విజయాన్ని అందించిందా? బుచ్చిబాబు మేకింగ్ ఎలా ఉంది?**




విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు అన్నదే ఉండదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగిన వాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేసుకుంటుంటాడు. పేరుకి కూలీ అయినా క్రికెట్‌లో మాత్రం రాటు దేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటాయి. ఆరు బంతులకు ఆరు సిక్సర్లు కొట్టగలిగిన మొనగాడైన పెద్దిని అంతా ఆట కూలీ అని పిలుస్తుంటారు. అలాంటి ఆటగాడు క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సి వచ్చింది? కొండకింద ఊరు, అక్కడి మనుషుల కోసం పెద్ది చేసిన పోరాటంలో అతను ఏం కోల్పోయాడు? ఏం సాధించాడు? పెద్ది ప్రయాణంపై అప్పలసూరి (జగపతిబాబు), గౌర్‌నాయుడు (శివరాజ్‌కుమార్) ఎలాంటి ప్రభావం చూపించారు? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు?తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవాల్సిందే.

### ఎలా ఉందంటే?

గుర్తింపే తమ ఆత్మగౌరవం అని నమ్మి పోరాటం చేసిన ఓ క్రీడాకారుడి స్ఫూర్తిదాయక ప్రయాణమే ఈ చిత్రం. కన్నతల్లిలాంటి తన ఊరికి, అక్కడ పుట్టి పెరిగిన మనుషులకూ గుర్తింపే లక్ష్యంగా పెద్ది ఎంత దూరం వెళ్లాడు?రెండు ఆటల్ని కలిపి ఆడే క్రాస్ ఓవర్ అథ్లెట్‌గా ఎలా అవతరించాడన్నది ఇందులో కీలకం. ఈ మధ్య అగ్ర తారల సినిమాలు అనగానే మితిమీరిన హీరోయిజం, ఎలివేషన్స్‌కే పెద్దపీట వేస్తుంటారు దర్శకులు. అందుకు భిన్నంగా గుర్తింపు లేని ఓ ఊరి కథని, అలాంటి ఊళ్లో పుట్టి పెరిగి తరాలకు స్ఫూర్తిని నింపిన ఓ క్రీడాకారుడి ప్రయాణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం ఈ సినిమాలో కనిపిస్తుంది. క్రీడా నేపథ్యం లో ఇందులోనూ కొన్ని ఎలివేషన్స్ ఉన్నప్పటికీ అవన్నీ కథలో భాగంగానే అనిపిస్తాయి తప్ప ఎక్కడా తెచ్చిపెట్టినట్టు అనిపించవు. 2016 ఒలింపిక్స్ క్రీడలు ముగింపు తర్వాత నుంచి ఈ కథ మొదలవుతుంది. కోల్‌కతా నుంచి విజయనగరం మీదుగా కొండ కింద ఊరికి ప్రయాణం చేస్తుంది. లోయలు, జలపాతాలు దాటి మరీ వెళ్లాల్సిన ఆ ఊరిని పరిచయం చేసిన తీరే కాస్త సినిమాటిక్‌గా అనిపిస్తుంది. ఆట కూలీగా పెద్ది పరిచయంతో అసలు సిసలు సందడి మొదలవుతుంది. అతను ఆడే క్రికెట్ సినిమాకి ప్రధాన ఆకర్షణ. క్రికెట్ చరిత్రలోనే లేని సరికొత్త షాట్స్ ఆడుతూ రక్తికట్టిస్తాడు. ఆ తర్వాత హీరోయిన్ ప్రవేశం, ఆమె రాజకీయ ఎత్తుగడలు, ఆమె వెనక హీరో పడే సన్నివేశాలతో కథ నుంచి సినిమాని కాస్త పక్కకు తీసుకెళ్లాయి. అయితే, అప్పలసూరి చుట్టూ అల్లిన సన్నివేశాలతో కథలోని అసలైన సంఘర్షణ ఆవిష్కృతమవుతుంది. భావోద్వేగాలకు కావాల్సిన బలమైన పునాదిని ఆ సన్నివేశాలతోనే వేశాడు దర్శకుడు. విరామానికి ముందు వచ్చే రెండు బలమైన ఘట్టాలు సినిమాని మరోస్థాయికి తీసుకెళతాయి. ఆట మారిన తీరు చాలా సహజంగా కుదిరింది. విరామం తర్వాత కుస్తీ నేపథ్యంలో సన్నివేశాలు సినిమాకి మరింత కీలకం. ఆ పోరాట ఘట్టాల్ని కొరియోగ్రఫీ చేసిన విధానమూ ప్రత్యేకంగా ఉంది. క్రాస్ ఓవర్ అథ్లెట్ నేపథ్యం గురించి అక్కడ పరిచయం చేయడం, క్రికెట్‌నీ, కుస్తీని కలిపి మైదానంలో హీరో చెలరేగిపోయే తీరు పైసా వసూల్. ఇక కుస్తీ నేపథ్యంలో డ్రామా, ఆస్పత్రి సన్నివేశాలు మనసుల్ని హత్తుకుంటాయి. ప్రథమార్ధం తరహాలో ఇక్కడ కూడా ఆట మారే సందర్భం ఉంటుంది. అయితే, ఒక ఆట నుంచి మరో ఆటకు మారే క్రమంలో ఎదురయ్యే సవాళ్లు, సంఘర్షణని ఇక్కడ చూపించేంత సమయం దర్శకుడికి దొరకలేదు. పెద్ది ఏ ఆటనైనా ఇట్టే అంది పుచ్చుకుంటాడని ఓ చిన్న డైలాగ్‌తో సరిపెట్టేశారు. పతాక సన్నివేశాలు హృద్యంగా సాగుతాయి. ప్రథమార్ధంలో ఎక్కువగా కమర్షియల్ హంగులకే ప్రాధాన్యమిచ్చిన దర్శకుడు... ద్వితీయార్ధంలో పూర్తిగా కథపైనే దృష్టిపెట్టాడు. అయితే ఫస్టాఫ్‌లోని కొన్ని పాత్రలు సెకండాఫ్‌కు వచ్చేసరికి అనూహ్యంగా మారిపోయి కనిపిస్తాయి. దానివెనక లాజిక్ ఉండదు. అక్కడక్కడా కొన్ని కొన్ని లోపాలున్నా ఇదొక అర్థవంతమైన, స్ఫూర్తిదాయకమైన సినిమా. కమర్షియల్ హంగులకు ఏమాత్రం లోటు చేయకుండా ఓ మంచి కథని చెప్పే ప్రయత్నం చేశాడు దర్శకుడు. తెలుగులో ఈ తరహా ప్రయత్నాలు చాలా అరుదు. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుందడంలో ఎలాంటి సందేహం లేదు.

### ఎవరెలా చేశారంటే..

రామ్ చరణ్ మరోసారి కథని బలంగా నమ్మి చేసిన సినిమా ఇది. రెండు మూడు కోణాల్లో కనిపిస్తూ ఆయన ఇందులో ఒదిగిపోయిన తీరు చాలా బాగుంది. ముఖ్యంగా కుస్తీ క్రీడాకారుడిగా కనిపించేందుకు శారీరకంగా తనని తాను మార్చుకున్న తీరు, పోరాట సన్నివేశాల్లో ఆయన పడిన కష్టం తెరపై స్పష్టంగా కనిపిస్తుంది. బలమైన అభిమానగణం ఉన్న ఓ కమర్షియల్ హీరో ఇలాంటి కథని నమ్మి చేయడం అరుదు. మూడో ఆట నేపథ్యంలో సన్నివేశాలు చేయడం రిస్క్ అనుకునే హీరోలే ఎక్కువ. కానీ, చరణ్ బలంగా కథను నమ్మారు. జాన్వీ కపూర్ ఈ సినిమాకి అందాన్ని తీసుకొచ్చింది. ప్రథమార్ధంలోనే ఆమె సందడి. 'చికిరి' పాటతో ఆకట్టుకుంటుంది. ద్వితీయార్ధంలో ఆమె పాత్రకి పెద్దగా ప్రాధాన్యం లేదు. జగపతిబాబు అప్పలసూరి పాత్ర, గెటప్ సినిమాకున్న ఆకర్షణల్లో ఒకటి. గౌర్‌నాయుడు పాత్రని డిజైన్ చేసిన తీరు, అందులో శివరాజ్‌కుమార్ చూపించిన హుందాతనం ఆకట్టుకుంటుంది. రావు రమేశ్, దివ్యేందు శర్మ పాత్రలకు పెద్దగా ప్రాధాన్యం లేదు. పేరున్న నటులు చాలామందే ఉన్నారు కానీ, ఆ పాత్రల ప్రభావం తక్కువే. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. ఏఆర్ రెహమాన్ పాటలు ఆకట్టుకుంటాయి. ఆయన నేపథ్య సంగీతం మరో స్థాయిలో ఉంటుంది. రత్నవేలు కెమెరా పనితనం సినిమాకి ప్రాణం పోసింది. ప్రొడక్షన్ డిజైన్, ఎడిటింగ్ తదితర విభాగాల పనితీరులోనూ ప్రమాణాలు కనిపిస్తాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా భావోద్వేగాలతో కూడిన ఓ మంచి కథని చెప్పారు. వాణిజ్యాంశాలకూ లోటు చేయలేదు. తెలుగు తెరపై అరుదుగా చూసే ఈ తరహా కథను ఆయన రాసుకోవడం ఎంత ప్రత్యేకమో, చరణ్ నమ్మి నటించడం కూడా అంతే ప్రత్యేకం. బుచ్చి రాసిన సంభాషణలు ఆకట్టుకుంటాయి. 'ఆ ఊరికీ ఈ ఊరికీ దూరం తగ్గించడం కాదు రా... ఆ మనుషులకీ ఈ మనుషులకీ మధ్య దూరం తగ్గించడం' తరహా సంభాషణలు ఆలోచింపజేస్తాయి. నిర్మాణం ఉన్నతంగా ఉంది.



## పాయల్ రాధాకృష్ణ క్యూట్ లుక్స్


పాయల్ రాధాకృష్ణ మోడలింగ్ రంగం నుంచి సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఈమె 2021లో విడుదలైన 'సింగపెన్నె' చిత్రంతో వెండితెరకు పరిచయమైంది. అదే ఏడాది 'తరగతి గది ధాటి' అనే వెబ్ సిరీస్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. అనంతరం పలు తెలుగు చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. తాజాగా ఈ నటి 'పాపం ప్రతాప్' సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. మంచి అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద యావరేజ్ విజయాన్ని అందుకుంది. అయితే ఈ మూవీ ద్వారా పాయల్‌కు తెలుగులో మంచి గుర్తింపు లభించింది. సినిమాల్లో తన అందం, అభినయంతో ఆకట్టుకుంటున్న ఈ భామ సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఈ బ్యూటీ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. అందులో గ్రీన్ కలర్ టైట్ స్లీవ్‌లెస్ డ్రెస్‌లో కనిపిస్తూ తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. ఈ ఫోటోల్లో పాయల్ మెడలో చిన్న చైన్, చెవులకు చిన్న ఇయర్ రింగ్స్ ధరించి, చేతికి స్టైలిష్ బ్రాస్‌లెట్ వేసుకుంది. అలాగే వెంట్రుకలను అందంగా సెట్ చేసుకొని క్యూట్ స్టైల్‌తో కెమెరాకు ఫోజులు ఇచ్చింది. మొత్తంగా ఈ ఫోటోల్లో ఆమె క్యూట్ లుక్స్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటుండగా, ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## పెద్ది థియేటర్‌లో ఉపాసన హంగామా

తన ఆటలతో అభిమానులకు ఫుల్ ట్రీట్ ఇచ్చాడు రామ్ చరణ్. ఆయన హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' థియేటర్‌లలో సందడి చేస్తోంది. ఈ చిత్రం ప్రీమియర్స్‌లో రామ్ చరణ్ భార్య ఉపాసన ఎంజాయ్ చేశారు. హైదరాబాద్ బాలానగర్‌లో స్పెషల్ స్క్రీనింగ్‌కు వచ్చిన ఉపాసన , అభిమానుల మధ్య సినిమా చూసి వారిలో ఉత్సాహం నింపారు. రామ్ చరణ్ ఎంట్రీ సమయంలో పేపర్‌లు ఎగరేసి జోష్ పెంచారు. ఫ్యాన్స్‌తో పాటు ఆమె కూడా ఉత్సాహంగా అరుస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇక పెద్ది హిట్ టాక్ రావడంతో థియేటర్‌ల వద్ద పండగ వాతావరణం నెలకొంది. రామ్ చరణ్ నటనను ప్రశంసిస్తూ సెలబ్రిటీలు పోస్ట్‌లు పెడుతున్నారు. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందంటూ అభినందిస్తున్నారు.

## త్వరలోనే ఇరుముడి థీమ్ సాంగ్ విడుదల




మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'ఇరుముడి' నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి ఒక ప్రత్యేకమైన సాంగ్ అప్‌డేట్‌ను మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా అభిమానుల నుంచి వస్తున్న భారీ రిక్వెస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని, ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ 'ఇరుముడి' థీమ్ సాంగ్‌ను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ పాట 'విల్లాది వీరుడు వీర మణికంఠుడు' అనే పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తి గీతంగా ఉండబోతోందని తెలుస్తుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, ఇందులో రవితేజ ఒక ఎమోషనల్ తండ్రి పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. కూతురి కోసం ఒక తండ్రి పడే తపన, మద్యపానానికి దూరమై అయ్యప్ప దీక్ష స్వీకరించి ఆధ్యాత్మిక మార్గంలో సాగే ఒక ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా కథాంశం ఉండబోతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురిగా కీలక పాత్ర పోషిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఆగస్టులో థియేటర్లలోకి రానుంది.

# వంట నూనె ప్యాక్‌ల పరిమాణం ఒకేలా ఉండాలి

## నిబంధనలు తీసుకురాబోతున్న ప్రభుత్వం



**న్యూఢిల్లీ :** వంట నూనె ప్యాక్ పరిమాణాలను ప్రామాణీకరించడానికి ప్రభుత్వం నిబంధనలు ప్రకటించనుంది. ప్రస్తుతం 850 మిల్లీలీటర్లు (ఎంఎల్), 875 ఎంఎల్, 900 ఎంఎల్, 950 ఎంఎల్ ప్యాక్‌లతో పాటు మరికొన్ని పరిమాణాల్లో వంటనూనె ప్యాక్‌లను కంపెనీలు విడుదల చేస్తున్నాయి. విభిన్న పరిమాణాల్లో వస్తున్న ప్యాక్‌ల వల్ల వినియోగదారులు వివిధ బ్రాండ్‌ల ధరలను పోల్చుకోలేకపోతున్నారు. ఒక లీటరు (1000 ఎంఎల్) నూనె ధర ఎంతో అంచనా వేయడం కష్టతరం అవుతోంది. వినియోగదారుల రక్షణ, పారదర్శక లేబులింగ్, సుస్థిర ప్యాకేజింగ్ పద్ధతులపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో, ఈ అంశం తెరపైకి వచ్చింది. వంట నూనె ప్యాక్ పరిమాణాలను క్రమబద్ధీకరించే చర్యలు తీసుకుంటున్నందుకు సంతోషిస్తున్నామని పి మార్క్ మస్టర్డ్ ఆయిల్ బ్రాండ్ ప్రమోటర్, పురి ఆయిల్ మిల్స్ లిమిటెడ్ ఎండీ వివేక్ పురి పేర్కొన్నారు.




# ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్ సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. రోజంతా మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీలు.. స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు శుక్రవారం వెలువడనున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. డాలరుతో రూపాయి మారకం విలువ 95.84గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 96.61 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,469 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. సెన్సెక్స్ ఉదయం 73,935.83 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,346.17) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభనష్టాల మధ్య కదలాడింది. ఇంట్రాడేలో 73,807.30 – 74,544.24 మధ్య కదలాడిన సూచీ.. చివరికి 13.84 పాయింట్ల లాభంతో 74,360.01 వద్ద ముగిసింది. నిఫ్టీ 10.95 పాయింట్ల లాభంతో 23,416.55 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో టైటాన్, ఎటర్నల్, ఐటీసీ, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలు చవిచూశాయి.



## వైభవ్ సూర్యవంశీ ఆదాయపు పన్ను

# ఎవరు చెల్లించాలి?

తన అసాధారణ బ్యాటింగ్ ప్రతిభతో ఈసారి ఐపీఎల్‌లో అందరి దృష్టినీ ఆకర్షించాడు వైభవ్ సూర్యవంశీ. 15 ఏళ్ల వయసులోనే ఐపీఎల్ కాంట్రాక్టులు, స్పాన్సర్‌షిప్ డీల్స్, ఎండార్స్‌మెంట్లతో రూ.7 కోట్ల వరకు ఆర్జించాడు ఈ బిహారీ బుడతడు. మరి వైభవ్ సంపాదించిన దానికి ట్యాక్స్ ఎవరు కట్టాలి? ఆదాయపు పన్ను చట్టంలో మైనర్లకు సంబంధించి ఉన్న నిబంధనలేం చెబుతున్నాయి? భారతీయ ఆదాయపు పన్ను చట్టాల ప్రకారం.. 18 ఏళ్లలోపు వారిని మైనర్లుగా పరిగణిస్తారు. వారు ఆర్జించిన ఆదాయం తల్లిదండ్రుల ఆదాయంగానే పరిగణిస్తారు. సాధారణంగా పిల్లల పేర్ల మీద చేసే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెట్టుబడులు ఈ కోవలోకి వస్తాయి. మైనర్ పేరు మీద వచ్చిన ఆదాయాన్ని ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 64 ప్రకారం.. మైనర్ల ఆదాయాన్ని వారి తల్లిదండ్రులలో ఎవరికైతే ఎక్కువ పన్ను ఆదాయం ఉంటుందో వారి ఆదాయంతో కలిపి పన్ను విధిస్తారు.

ఐపీఎల్ స్టార్ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ విషయంలో ఒక మినహాయింపు ఉంది. ఒక మైనర్ తన సొంత ప్రతిభ, ప్రత్యేక నైపుణ్యాలు, శారీరక శ్రమ, వృత్తిపరమైన కృషి ద్వారా సంపాదించే ఆదాయాన్ని తల్లిదండ్రుల ఆదాయంతో కలపకూడదు. వైభవ్ సంపాదనంతా అతడి క్రికెట్ కాంట్రాక్టులు, మ్యాచ్ ఫీజులు, స్పాన్సర్‌షిప్‌లు, ఎండార్స్‌మెంట్ల ద్వారా వచ్చింది కాబట్టి.. అతడి క్రీడా నైపుణ్యానికి దక్కిన ప్రతిఫలంగా భావిస్తారు. ఈ ఆదాయాన్ని వైభవ్ సొంత ఆదాయంగానే పరిగణిస్తారు. ఒక్క క్రికెటర్ అనే కాదు.. బాల నటులు, గాయకులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, రియాలిటీ షోలలో పాల్గొనే ప్రతిభావంతులైన మైనర్లందరికీ ఇదే నిబంధన వర్తిస్తుంది. ఇలా వచ్చిన ఆదాయానికి మైనర్లు వారి పేరుమీదే ఆదాయపు పన్ను రిటర్నులను దాఖలు చేయాల్సి ఉంటుంది. మైనర్ తరఫున వారి తల్లిదండ్రులు లేదా చట్టబద్ధమైన సంరక్షకులు ప్రతినిధిగా వ్యవహరిస్తూ రిటర్నుల దాఖలు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. వైభవ్ సూర్యవంశీ ఆదాయాన్ని వృత్తి లేదా వ్యాపారం ద్వారా ఆదాయంగా పరిగణిస్తారు. కాబట్టి, వీరు ఐటీఆర్–3 లేదా ఐటీఆర్–4 దాఖలు చేయాల్సి ఉంటుంది. పన్ను ఆదాయం వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు వర్తించే శ్లాబులే సూర్యవంశీకి వర్తిస్తాయి. సూర్యవంశీ ఆదాయం రూ.కోట్లలో ఉంది కాబట్టి దాదాపు 30 శాతం వరకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది.



## టీ20 కెప్టెన్సీ రేసులో శ్రేయస్

**ముంబయి:** టీ20 కెప్టెన్సీ నుంచి సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించడం ఖాయమని తెలుస్తోంది. కొత్త సారథిగా శ్రేయస్ అయ్యర్‌ను నియమించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. తిలక్ వర్మ కూడా రేసులో ఉన్నాడు. సూర్యను తప్పించే విషయంలో సెలక్టర్లు, కోచ్ గంభీర్‌ల అభిప్రాయం గురించి బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియా.. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌కు వివరించనున్నట్లు సమాచారం. “టీ20 కెప్టెన్‌గా సూర్యను తప్పించనున్నారు. ఐపీఎల్‌లోనైనా అతడు ఫామ్‌ను అందుకుంటాడేమోనని సెలక్టర్లు భావించారు. కానీ అతడు ఏమాత్రం ఫామ్‌లో లేడు. కఠిన నిర్ణయం తీసుకోక తప్పదు” అని ఓ బీసీసీఐ అధికారి చెప్పాడు. కెప్టెన్సీ కోల్పోతే.. సూర్యకు జట్టులో కూడా స్థానం దొరికే అవకాశం లేదు. ఏడాదిన్నర నుంచి బ్యాటర్‌గా అతడు పేలవ ఫామ్‌లో ఉన్నాడు. సూర్య ఇప్పటివరకు 113 టీ20ల్లో 36.35 సగటు, 162.94 స్ట్రైక్‌రేట్‌తో 3272 పరుగులు చేశాడు. కానీ 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు 35 మ్యాచ్‌ల్లో 26 సగటుతో 702 పరుగులు మాత్రమే సాధించాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లో టీ20 సిరీస్‌లు ఆడే భారత జట్టును శనివారం ఎంపిక చేయనున్నారు. భారత జట్టు ఐర్లాండ్ పర్యటనలో రెండు టీ20 మ్యాచ్‌లు (జూన్ 26, 28) ఆడుతుంది. ఆ తర్వాత ఇంగ్లాండ్ పర్యటనలో అయిదు టీ20లు, మూడు వన్డేలు ఆడుతుంది.

## రోహిత్, కోహ్లీ

# వన్డే సిరీస్ ఆడతారా?

### ఫిట్‌నెస్‌పై కొనసాగుతున్న సస్పెన్స్



అఫ్ఘానిస్థాన్‌తో జూన్ 13 నుంచి ప్రారంభం కానున్న 3 వన్డేల సిరీస్‌లో భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడతారా లేదా అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. గాయాల కారణంగా వీరిద్దరూ దూరమవుతున్నారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే స్పందించారు. ఫిట్‌నెస్ ప్రోటోకాల్స్ అందరికీ ఒకేలా ఉంటాయని, వైద్య బృందం నివేదిక ఆధారంగా త్వరలోనే అధికారిక నిర్ణయం ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ .. ప్రస్తుతం టెస్ట్, టీ20లకు గుడ్‌బై చెప్పి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్‌లో ఆడటమే లక్ష్యంగా వీరిద్దరూ అడుగులు వేస్తున్నారు. ఇక స్వదేశంలో జూన్ 13 నుంచి అఫ్ఘానిస్థాన్‌తో భారత్ వన్డే సిరీస్‌లో ఆడనుంది. మొత్తంగా మూడు వన్డే మ్యాచ్‌లు ఈ సిరీస్‌లో జరుగుతాయి. ఇందుకోసం ఎంపిక చేసిన జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ రోహిత్, కోహ్లీలు ఈ సిరీస్‌లో ఆడేది అనుమానంగా మారింది. ధర్మశాల వేదికగా తొలి వన్డే జరగనుంది. శుభమన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు ఈ సిరీస్‌లో తలపడనుంది. అయితే గాయాల కారణంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. వన్డే సిరీస్‌కు దూరమవుతారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై రకరకాల వార్తలు వస్తున్నాయి. రోహిత్ దూరమయ్యాడని.. కోహ్లీ ఆడతాడా లేదా అనేది తేలాల్సి ఉందని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే ఈ విషయంపై అప్‌డేట్ ఇచ్చాడు. “బయట ఎలాంటి చర్చ జరిగినా అనవసరం. అధికారికంగా మేం త్వరలోనే సమాచారం ఇస్తాం. విరాట్ కోహ్లీ లేదా రోహిత్ శర్మ వంటి పెద్ద ఆటగాళ్లు సిరీస్‌లో ఆడకపోవడం బిగ్ న్యూస్ అవుతుందని తెలుసు. ఫిట్‌నెస్‌కు సంబంధించి ప్రోటోకాల్స్ అందరికీ ఒకేలా ఉంటాయి. సిరీస్ ప్రారంభానికి ఇంకొంత సమయం ఉంది. ఆలోగా మేం నిర్ణయం తీసుకుంటాం. ఫిట్‌గా ఉంటే తుది జట్టులో ఉంటారు. లేకపోతే అందుకు తగినట్టుగా మార్పులు చేసుకుంటాం. వైద్య బృందం నిర్ణయం తర్వాత.. ఆయా ఆటగాళ్ల పరిస్థితిపై అధికారికంగా స్పందిస్తాం” అని టెన్ డస్కటే చెప్పాడు.

**వన్డే సిరీస్ కోసం భారత జట్టు :** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గూర్నూర్ బ్రార్, హర్ష్ దూబె.

# హర్మన్‌ప్రీత్ ఖాతాలో మరో వరల్డ్ రికార్డు



క్రికెట్ అంటేనే ఇండియా పేరు మార్మోగిపోతోంది. అది ఏ ఫార్మెట్ కాని.. రికార్డులు తిరగరాస్తున్నారు. భారత మెన్ క్రికెట్ జట్టుతో సమానంగా విమెన్ క్రికెట్ జట్టు కూడా పటిష్టంగానే ఉంది. ఇక భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రపంచ రికార్డు సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన క్రీడాకారిణిగా హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త చరిత్ర లిఖించారు. ఇప్పటి వరకు న్యూజిలాండ్ క్రీడాకారిణి సుజీ బేట్స్ (367 మ్యాచ్‌లు) ఆడి టాప్ ప్లేసులో ఉండగా.. ఇంగ్లండ్‌లోని టాంటన్‌లో మంగళవారం జరిగిన మూడో టీ20 మ్యాచ్ తర్వాత హర్మన్‌ప్రీత్ కౌర్ కెరీర్‌లో 368వ అంతర్జాతీయ మ్యాచ్ పూర్తి చేసుకుంది. దీంతో న్యూజిలాండ్ ప్లేయర్ పేరుతో ఉన్న రికార్డును అధిగమించారు. ఈ జాబితాలో సుజీ బేట్స్ రెండో స్థానంలో ఉండగా ఆస్ట్రేలియాకు చెందిన ఎల్లీస్ పెర్రీ (357 మ్యాచ్‌లు) మూడో స్థానంలో కొనసాగుతున్నారు. 2009లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన 37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ పంజాబ్‌కు చెందిన ఆల్‌రౌండర్. ప్రస్తుతం విమెన్ టీమిండియా జట్టు సారథిగా ఉంది. ఇప్పటివరకు 7 టెస్టులు, 164 వన్డేలు, 197 టీ20 మ్యాచ్‌లు ఆడారు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ 1–2 తేడాతో కోల్పోయినప్పటికీ నిర్ణయాత్మకమైన ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ హాఫ్ సెంచరీతో రాణించడం విశేషం.

# రిటైర్మెంట్ ప్రకటించిన కోన శ్రీకర్ భరత్



భారత వికెట్ కీపర్, తెలుగు తేజం కోన శ్రీకర్ భరత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా గురువారం వెల్లడించాడు. గర్వంతో, కృతజజతా భావంతో ఆటకు వీడ్కోలు పలుకుతున్నట్లు తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. దేశం కోసం ఆడటం తన జీవితంలో లభించిన గొప్ప గౌరవమని తెలిపాడు. ‘ఎంతో గర్వంతో, కృతజ్ఞతాభావంతో నేను అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నాను. దేశం తరఫున ఆడటం జీవితంలో నాకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. నా ఈ ప్రయాణంలో ఎంతో పట్టుదల, బలం అవసరమయ్యాయి. కానీ టెస్ట్ క్రికెట్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా. నా కెరీర్‌కు అండగా నిలిచిన బీసీసీఐ, కోచ్‌లు, మేనేజర్లందరికీ నా ధన్యవాదాలు. అత్యున్నత స్థాయిలో ఆడటానికి గొప్ప వాతావరణాన్ని సృష్టించి, నాకు నిరంతరం మద్దతుగా నిలిచినందుకు మీ అందరికీ స్పెషల్ థ్యాంక్స్. నా సహచర ఆటగాళ్లందరికీ బిగ్ థ్యాంక్స్. మనమందరం కలిసి పంచుకున్న క్షణాలు, సాధించిన విజయాలు నా కెరీర్‌లో ఎంతో సహాయపడ్డాయి. మీరందరూ లేకపోతే నా కలను నిజం చేసుకోవడం, ఇన్నేళ్లపాటు ఈ ఆటను ఆడటం నాకు సాధ్యమయ్యేది కాదు. నా ప్రతిభను నిరూపించుకోవడానికి, గుర్తింపు తెచ్చుకోవడానికి నాకు అవకాశం కల్పించిన నా ఐపీఎల్ అరంగేట్ర కెప్టెన్ విరాట్ కోహ్లీ, టెస్ట్ కెప్టెన్ రోహిత్ శర్మ, నా టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సార్‌కి ధన్యవాదాలు. భారత్–ఏ జట్టు నుంచి టీమిండియా వరకు ఆయన అందించిన గైడెన్స్ ఎప్పటికీ మరవలేనిది. మీ మద్దతుతోనే నేను భారత టెస్ట్ క్రికెటర్‌ను కాగలిగాను. యువ ఆటగాళ్లకు నా సలహా ఏంటంటే.. పెద్ద కలలు కనండి. వాటిని సాధించడానికి నిరంతరం కష్టపడండి. పట్టుదల, క్రమశిక్షణ, కష్టపడే తత్వం, దృఢ సంకల్పం ఉంటే కలలు ఖచ్చితంగా సాకరమవుతాయి. బీసీసీఐ, టెస్ట్ క్రికెట్‌తో నా ప్రయాణం ముగిసి ఉండవచ్చు. కానీ ఈ ఆటతో నా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రాణించాలని కలలు కనే తదుపరి తరానికి మార్గదర్శకత్వం. మెంటారింగ్, కోచింగ్ ఇవ్వడం ద్వారా నా వంతుగా క్రికెట్‌కు సేవ చేస్తూనే ఉంటాను.’అని కేఎస్ భరత్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు చెందిన 32 ఏళ్ల భరత్ తన కెరీర్‌లో 7 టెస్టులు, 10 ఐపీఎల్ మ్యాచులు ఆడాడు. ఐపీఎల్ 2024 ఛాంపియన్‌గా నిలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.



# మారుతీ సుజుకీ నుంచి తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ కారు

చమురు దిగుమతులు తగ్గించి, ఇథనాల్ వినియోగాన్ని పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఆటోమొబైల్ కంపెనీలు ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలను రూపొందిస్తున్నాయి. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (జూన్ 5) పురస్కరించుకుని హీరో మోటోకార్ప్ రెండు ఫ్లెక్స్ ఫ్యూయల్ మోటార్ సైకిళ్లను బుధవారం లాంచ్ చేయగా.. తాజాగా ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తొలి ఫ్లెక్స్‌ఫ్యూయల్ కారు వ్యాగనార్‌ను పరిచయం చేసింది. కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, హర్‌దీప్ సింగ్ పురి ఈ కారును గురువారం ఆవిష్కరించారు. భారతదేశ ఇంధనరంగంలో సరికొత్త అధ్యాయం మొదలైందని మారుతీ సుజుకీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హిసాషీ టకేయుచి ఈసందర్భంగా పేర్కొన్నారు. క్రూడాయిల్ దిగుమతులు తగ్గించుకోవడం, కర్బన ఉద్గారాలు తగ్గించుకోవడం భారత్ ముందున్న రెండు ప్రధాన లక్ష్యాలని వివరించారు. ఈ రెండూ ఫ్లెక్స్ ఫ్యూయల్‌తో సాకారం అవుతాయన్నారు. బయో ఫ్యూయల్, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వైపు మళ్లేలా ఆటోమొబైల్ కంపెనీలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మార్గనిర్దేశం చేశారని చెప్పారు. ఫ్లెక్స్‌ఫ్యూయల్ టెక్నాలజీ వల్ల ఆటోమొబైల్‌కు మాత్రమే కాకుండా రైతులకు, ఇథనాల్ ఉత్పత్తిదారులకూ మేలు చేకూరుతుందన్నారు. ఇందులోభాగంగా మారుతీ సుజుకీ ఆ దిశగా కీలక ముందడుగు వేసిందన్నారు. ఇక ఈ కారు విషయానికొస్తే.. 1.2 లీటర్ పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారు సాధారణ పెట్రోల్‌తో పాటు 85 శాతం వరకు ఇథనాల్ బ్లెండ్ చేసిన ఇ85 ఫ్యూయల్‌తోనూ నడుస్తుంది. డిజైన్ పరంగా ఇ20 మోడల్‌ను పోలి ఉంది. ధర, ఇతర వివరాలు వెల్లడించలేదు. అయితే, రూ.8.50 లక్షల వరకు ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఫ్లెక్స్ ఫ్యూయల్ కారు లాంచ్ చేసిన నేపథ్యంలో మారుతీ సుజుకీ కంపెనీ షేర్లు రాణించాయి. ఓ దశలో 1.5 శాతం లాభంతో షేరు విలువ రూ.13,250కి పెరిగాయి. మధ్యాహ్నం 12.50 గంటల సమయానికి దాదాపు ఒక శాతం లాభంతో రూ.13,152 వద్ద ట్రేడవుతోంది.



## రూ.15.15లక్షల కోట్ల ఆదాయమంటూ

# రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ అవకతవకలు

### సెబీ చర్యలు

బెంగళూరుకు చెందిన ప్రముఖ జ్యువెలరీ రిటైల్ సంస్థ రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్‌పై సెబీ చర్యలు చేపట్టింది. ఈ సంస్థ ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో కంపెనీ, దాని ప్రమోటర్ అయిన రాజేశ్ మెహతాను సెక్యూరిటీస్ మార్కెట్ల నుంచి తాత్కాలికంగా నిషేధించింది. దీంతో నేటి స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ సెషన్‌లో ఈ కంపెనీ షేర్లు పతనమయ్యాయి. దీని షేరు విలువ 5శాతం నష్టంతో లోయర్ సర్క్యూట్‌ను తాకి రూ.103.92కు పడిపోయింది. ఈ పరిణామాల నేపథ్యంలో నేటి ట్రేడింగ్‌లో ఎల్ఐసీ (ూ×జ) షేర్లు కూడా కుంగిపోయాయి. ఒక దశలో షేరు విలువ 1శాతానికి పైగా పడిపోయింది. ఉదయం 11 గంటల సమయంలో నిఫ్టీలో ఎల్ఐసీ షేరు విలువ 0.77శాతం నష్టంతో రూ.399.80 వద్ద ట్రేడ్ అవుతోంది. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో ఎల్ఐసీకి 10.80శాతం వాటాలు ఉండటమే ఈ నష్టాలకు కారణం. రాజేశ్ ఎక్స్‌ఫోర్ట్స్ ఏకీకృత ఆదాయంలో 97–99శాతం దాని విదేశీ అనుబంధ సంస్థల నుంచే సమకూరుతోంది. ముఖ్యంగా స్విట్జర్లాండ్ కేంద్రంగా పనిచేసే సంస్థ నుంచి ఈ ఆదాయం వచ్చినట్లు కంపెనీ పేర్కొంది. అయితే, ఆ అనుబంధ సంస్థల ఆర్థిక లావాదేవీలను మాత్రం కంపెనీ బహిర్గతం చేయలేదు. దీంతో సెబీ తనిఖీలు చేపట్టగా.. కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. స్విట్జర్లాండ్ సంస్థ స్టాండ్‌ఎలోన్ ఆదాయం చాలా తక్కువగా ఉండగా.. రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ మాత్రం దాన్ని పెంచి చూపించినట్లు సెబీ దర్యాప్తులో గుర్తించింది. అలా 2021–2025 ఆర్థిక సంవత్సరాల మధ్య దాదాపు రూ.15.15లక్షల కోట్ల ఆదాయం సమకూరినట్లు కంపెనీ తప్పుడు ప్రచారం చేసుకుందని సెబీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రెగ్యులేటరీ చర్యలు చేపట్టింది. సెబీ చర్యలపై రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ స్పందిస్తూ ప్రకటన విడుదల చేసింది. ఆర్థిక అవకతవకలంటూ వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చింది. తాము నివేదించిన ఆదాయ వివరాలన్నీ సరైనవేనని పేర్కొంది. కమ్యూనికేషన్ గ్యాప్, గందరగోళం వల్లే సెబీ ఈ ఆదేశాలు జారీ చేసి ఉంటుందని బీఎస్ఈ ఫైలింగ్‌లో వెల్లడించింది.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com